# అయిదు నాటకాలు

## ఆంగ్లనాటకాల సమీక్షలు

– గొల్లపూడి మారుతీరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 5

# విషయ సూచిక

| నాటకం | పేజీ |
|---|---|
| ది థర్టీనైన్ స్టెప్స్ | 3 |
| బోయింగ్ - బోయింగ్ | 9 |
| లే మిజరబుల్స్ | 13 |
| ఆంటోనీ అండ్ క్లియో పాత్రా | 21 |
| ది గ్లాస్ మెనేగరీ | 26 |



# అయిదు నాటకాలు

## గొల్లపూడి మారుతీరావు

గొల్లపూడి మారుతి రావు గారు తరచూ లండన్ వెళుతుంటారు. అక్కడ ప్రదర్శితమయ్యే స్టేజి నాటకాలు చూడడం ఆయనకి హాబీ. అలా ఆయన వీక్షించిన నాటకాల్లో ఒక ఐదు ప్రసిద్ధమైన నాటకాలని ఎంపిక చేసి వాటి గురించి, 'కౌముది' పాఠకులకి పరిచయం చేస్తున్నారు. అరుదైన ఈ అనుభవాల వివరాలు మీ అందరికీ ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

**ఎప్పుడు** ఏ కారణానికి ఇంగ్లండ్ వెళ్ళాలన్నా - నన్ను ఆకర్షించేది, తన వేపు తిప్పుకునేదీ ఇంగ్లండ్ నాటక రంగమే. సెంట్రల్ లండన్‌లో పికడిల్లీ స్టేషన్‌లోంచి (అండర్ గ్రౌండ్) బయటకి రాగానే ఎదురుగా కనిపించే వీధి పేరు హేమార్కెట్. దాని కింద గర్వంగా ఇంగ్లీషువారు వ్రాసుకున్న ఓ మాట ఉంది. "హేమార్కెట్ వీధి: థియేటర్ లాండ్" అని. ఇది నాటక ప్రపంచం అని చెప్పుకోవడం వారికి గర్వకారణం.

విజయవాడ గవర్నరు పేటలోనో, మద్రాసు మూర్ మార్కెట్‌లోనో, విశాఖపట్నం జగదాంబా సెంటర్‌లోనో వ్యాపారం లాగ ఈ ప్రాంతంలో ఎన్నో ఎన్నో దుకాణాలు విరివిగా, అను నిత్యం అమ్మే సరుకు ఒకటుంది - నాటకం టిక్కెట్లు. సంవత్సరం పొడుగునా ఆ దుకాణాల ముందు క్యూలుంటాయి. ఆ క్యూలలో థాయ్‌లాండ్ వారూ, కొరియా వారూ, జపాన్ వారూ, మారిషస్ వారూ, మారుతీరావులూ కోకొల్లలుగా ఉంటారు. కనీసపు టిక్కెట్లు 800 రూపాయలనుంచీ 5,000 రూపాయలదాకా ఉంటాయి. కానీ ఎవరూ డబ్బు గురించి ఆలోచిస్తున్నట్టు కనిపించరు. కాగా చేతికి టిక్కెట్టు వచ్చినందుకే ఆనందించి తరలిపోతుంటారు. కొత్త నాటకాలూ, గొప్ప నాటకాలూ సరేసరి - దాదాపు అన్ని నాటకాలకీ - ప్రదర్శన రోజున ఏమయినా సీట్లు మిగిలిపోతే సగం రేట్లకి అమ్మే దుకాణాలున్నాయి. ఆయా నాటకాల సగం ధరలు ప్రదర్శిస్తూ బయట బోర్డులుంటాయి. చెకోవ్ 'సీగల్', షేక్స్పియర్ 'మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్', పోర్గీ అండ్ బెస్ సంగీత నాటకం, పీటర్ షాఫర్ 'ఈక్వస్' - ఇలా నాటకాల పేర్లు చదువుతుంటే - దాదాపు 550 సంవత్సరాల నాటక రంగం ఇక్కడ - ఇంకా 2007లో ప్రేక్షకుల ఆదరణ పొందుతున్నందుకు ఒక పక్క దిగ్భ్రమ మరొక ప్రక్క ఆనందమూ కలుగుతుంది. సరైన కృషితో, దక్షతతో పూనుకుంటే మనదేశంలో ఒక మృచ్ఛకటికం, ముద్రారాక్షసం, అభిజ్ఞాన శాకుంతలం, ప్రతాప రుద్రీయం, చాణుక్య - చంద్రగుప్త ప్రదర్శించడం అసాధ్యం కాదు అనిపిస్తుంది.

ఇది ఇంగ్లండులో చలికాలం. మామూలు చలి కాదు. పేగులు కొరికే చలి. హీత్రో ఎయిర్ పోర్టులోంచి బయటికి రాగానే - రాత్రి ఏడున్నరకి - సరిగ్గా ఒక డిగ్రీ ఉష్ణోగ్రత అనే వీలులేదు. బహుశా హిమోగ్రత అనాలేమో. నా జీవితంలో మంచు వర్షాన్ని ఆ అయిదురోజుల్లో చూశాను. వేల్స్, బర్మింగ్‌హాం ప్రాంతాల్లో పది అంగుళాల దళసరిన మంచు కురిసిందట. లండన్‌లో నాలుగయిదు

అంగుళాల మంచు. ఆ కథ ముందు చెపుతాను.

సాయంకాలం ఏడున్నరకి నాటక ప్రదర్శన మొదలయి రాత్రి పదిన్నర దాకా సాగుతుంది. అంటే రోజులో చల్లదనం భయంకరమయిన స్థాయికి వచ్చేవేళకి థియేటర్‌లోంచి బయటకు వస్తారు ప్రేక్షకులు. ఈ కారణంగా నాటక శాలలు ఖాళీగా ఉంటాయా? మనదేశంలో నాటకశాలలకి ప్రేక్షకులు రాకపోవడానికి కారణాలు వెదుకుతాం. ఏవో సాకులు వెదుక్కుని సరిపెట్టుకుంటాం. పేవ్‌మెంట్ మీద కాలు పెడితే మంచు పొరలో జారిపోయే - 4 డిగ్రీల చలి ఆవరించుకున్న రోజున - ఆ రాత్రి నాటకశాల ప్రేక్షకులతో క్రిక్కిరిసి పోయింది! ఇది ఆ నాటక రంగానికీ, ఆ నాటకాలకీ, ఆ నటులకీ, ఆ ప్రయోక్తలకీ - అన్నిటికీ మించి ప్రేక్షకులకీ నివాళి!

ఈసారి నేను చూసినవి అయిదు నాటకాలు. ఏదో కారణానికి వెనక 'చరిత్ర' ఉన్న నాటకాలు. ఈ అయిదూ - పేరు వినగానే గతాన్ని గుర్తు చేసే రచనలు. అయితే ఒకదానికొకటి పొంతనలేని విలక్షణమయిన కళాఖండాలు - వేర్వేరు కారణాలకి.

ప్రేక్షకుడు చూసే చూపు నాటకాన్ని ఆకర్షింప చేస్తుంది. దానికి కారణం నటుల నటనా, రచయిత రచనా, ప్రయోక్త నేర్పా, లైటింగు ప్రత్యేకతా, ప్రక్రియలో కొత్తదనమా - ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు - అయిదు రకాల నాటకాలలో ఆయా పాళ్ళలో ఆయా ప్రత్యేకగ్తలు ద్యోతకమవడం నేను గమనించాను.

లండన్ వచ్చేవారు లండన్ బ్రిడ్జిని, థేమ్స్ నదినీ, బిగ్‌బెన్‌నీ, వెస్టుమినిస్టర్ అబ్బీని, బకింగ్‌హోమ్ పాలెస్‌నీ, వింబుల్డన్‌నీ మాత్రమే కాక వెస్టెండ్ నాటకం చూడడానికి వస్తారని గ్రహించడానికి పెద్ద ప్రయత్నం అక్కర్లేదు. ఓ మంచి ఉదాహరణ - నేనే. ఇది ఆరోసారి లండన్ వెళ్ళడం. అయిదుసార్లూ తప్పనిసరిగా నాటక ప్రపంచం కోసమే వెళ్ళాను. ప్రతిసారీ నాలాంటి అభిమానులు తారసపడుతుంటారు. ఆ అభిమానుల జాబితా విచిత్రంగానూ, విలక్షణంగానూ ఉంటుంసి. ఇదివరకు ఈ వ్యాసాలలోనే పేర్కొన్నాను. నాటక రంగం బతికి బట్ట కడుతుంది. వండిన పదార్థాన్ని వంట తిన్నప్పుడు కాదు దాని రాణింపు. పదార్థం వివరం తెలియక పోయినా అది తినాలని ఆతృత చూపే 'రసన' దానికి పోషణ.

<u>ఇప్పుడు నాటకాల గురించి:</u>




## ది థర్టీ నైన్ స్టెప్స్

### ( ముప్పై తొమ్మిది మెట్లు)

ఈ పేరుతో నవల రాసిన రచయిత జాన్ బచన్ - పాత్రికేయుడు, రాజకీయ నాయకుడు, దౌత్య ఉద్యోగి, ఒక ప్రచురణ సంస్థ డైరెక్టరు, న్యాయవాది. కెనడా గవర్నరు జనరలుగా పనిచేశారు. ఆయన తన 39 వ ఏట పెద్ద పేగుకి సంబంధించిన (డియోడినల్) వ్యాధితో మంచమెక్కారు. తప్పనిసరిగా విశ్రాంతిగా మంచం మీద ఉండాల్సిన పరిస్థితి. ఏం చెయ్యాలో ఊసుపోక ఓ నవల వ్రాయడం ప్రారంభించారు. ఆ నవలే ఈ 39 మెట్లు. తన వయస్సు 39వ ఏటకి ఈ నవలలో 39 మెట్లకీ ఏమయినా సంబంధం ఉందా? ఏమో! రచయిత మనస్సు విచిత్రమయిన ముడులు వేస్తుంది. ఇతమిద్ధమని కారణం చెప్పలేకపోయినా 39 అంకె ఆ విధంగానే పుట్టి ఉండవచ్చు.

ఈ నవలలో కథ మాట అలా ఉండగా - ఈ నవలని ఆధారం చేసుకుని తీసిన సినిమాలకి వేరే కథ ఉంది. హాలీవుడ్ చరిత్రలో ఈ "39 మెట్లు" కథని మూడుసార్లు సినిమాగా తీశారు. 1953 లో ప్రముఖ దర్శకులు ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ సినిమాగా తీశారు. మళ్ళీ

1959లో మరొకరు తీశారు. 1978లో మూడోసారి. విచిత్రం ఏమిటంటే మొదటి రెండు సినిమా కథలూ నవలని ఆధారం చేసుకుని తీసినవే కాని నవలతో ఎక్కువ పొంతనలేనివి. 1978 చిత్రం మాత్రం ఎంతో కొంత నవలకి దగ్గరగా వస్తుంది. మొదటి సినిమా హిచ్‌కాక్ తీసినప్పుడు జాన్ బచన్ దర్శకునితో గొడవ పెట్టుకుందామనుకున్నాడంట. కారణం, నవలకి చాలా భిన్నంగా సినిమాని రూపొందించడమే. అయితే 1953లో తీసిన సినిమాయే ఈ మూడింటిలో గొప్పదీ, పాపులర్ కూడా. ఇప్పటి నాటకం కూడా ఆ సినిమాని ఆధారం చేసుకున్నదేనని పెద్ద అక్షరాలతో హిచ్‌కాక్ పాపులారిటీని వాడుకున్నారు - నాటక ప్రదర్శకులు. అసలు నేను కానీ - మరెవరయినా కానీ -39 మెట్లు నాటకం చూడాలనుకోడానికి స్ఫూర్తి ఆల్ఫ్రెడ్ హిచ్‌కాకే. నేను 1978 సినిమా చూశాను. క్లైమాక్స్‌లో హీరో బిగ్‌బెన్ ముల్లుని పట్టుకుని వేలాడడం - తద్వారా ప్రపంచాన్ని పెద్ద ఉపద్రవం నుంచి కాపాడడం వంటిది ఆ కితాబునిచ్చింది: "సస్పెన్స్ థ్రిల్లర్ ఎలా తీయకూడదో తెలుసుకోవాలంటే ఆ సినిమా చూడాలి" అని. అదొక్కటి చాలు దాని నిర్వాకం గురించి చెప్పడానికి.

హిచ్‌కాక్ తీసిన రెండు గొప్ప సినిమాలు చెప్పమంటే - బ్లాక్ అండ్ వైట్‌లో తొలిరోజుల్లో బ్రిటన్‌లో తీసిన "39 మెట్లు", మలి రోజుల్లో హాలివుడ్‌లో తీసిన "నార్త్ బై నార్త్ వెస్ట్" సినిమాలు. విచిత్రమేమిటంటే - ఈ రెండూ కవలలు. బాణీలో టెక్నిక్‌లో, కథని నడపడంలో, పరుగులో, ఉక్కిరి బిక్కిరి చేసే సన్నివేశాల spot interest లో రెండూ దగ్గరగా కనిపిస్తాయి. అయితే 39 మెట్లు హిచ్‌కాక్ తొలినాటి చిత్రమని గుర్తుంచుకున్నప్పుడు - ఓ గొప్ప కళాకారుడి పరిణితికి ఆ రోజుల్లోనే బీజప్రదానం జరిగిందని గర్వపడాలనిపిస్తుంది.

నిజానికి హీరో హీరోయిన్ల చేతులకి బేడీలు తొడిగిన సన్నివేశం థ్రిల్లర్ సినీమాల ప్రక్రియలోనే ఒక ప్రముఖమయిన ఘట్టంగా ఇప్పటికీ చెప్పుకుంటారు. అలాగే కొన్ని వేల ఎకరాల బయలులో కేరీ గ్రాంట్ (హీరో)ని చంపడానికి చిన్న ఎరువులు జల్లే విమానం వెంటాడే సీను (నార్త్ బై నార్త్ వెస్ట్) అభిమానులకు గుర్తుండే ఉంటుంది. దాని బీజం ఈ సినిమాలో కనిపిస్తుంది.

నిజానికి ఈ సినిమా ఆధారంగా చిరంజీవికి నేనోకథ రాశాను. దాని పేరు "జేబుదొంగ". ఇక్కడొక తమాషా అయిన విషయం చెప్పాలి. ఇలాంటి థ్రిల్లర్‌ని రూపొందించేటప్పుడు ఓ ప్రశ్నని రచయితా, దర్శకుడూ వేసుకుంటారు. చివరలో హీరో ఏం సాధిస్తాడు? అన్నది. కథని బట్టి రకరకాలుగా ఉంటుంది. మెకన్నాస్ గోల్డ్‌లో ‘బంగారం‘ గమ్యం. పాతాళభైరవిలో రాజకుమారిని రక్షించే పనీ - ఇలాగ. ప్రేక్షకులు దానిగురించి ఎక్కువ ఆలోచించరు. దాన్ని సాధించే సాహసమే కథ కనుక. అదొక ‘తాయిలం‘. ఒక గుర్తు. ఒక సూచిక. ఈ తాయలానికి ‘మేక్ గఫిన్‘ అని సమాధానం. (అందులో బాంబు ఉందా? డైనమైట్ ఉందా? మర్డరయినా ఉందా? అది వేరే విషయం)

‘మేక్ గఫిన్ అంటే?‘

‘అడవిలో సింహాల్ని పట్టుకోవడానికి ఆయుధం‘



సున్నా డిగ్రీల చలిలో ఊలు టోపీతో థియేటర్ ముందు నిలుచున్నది నేనే..!

'ఇక్కడ అడివి లేదే!'

'అయితే మేక్ గఫినూ లేదు!'

ఇదీ జోక్. ఉంటే ఉనట్టు లేకపోతే లేనట్టూ - అది అంత ప్రేక్షకుల్ని ఇబ్బంది పెట్టే విషయం కాదు కనుక. ఓ కథ నడవడానికి, ప్రతీవారూ అదే ముఖ్యమైనదని నమ్మించే - అసలు ఏమీ లేని ఉత్తుత్తి 'తాయిలం'.

"39 మెట్లు" లో హీరో ఎవరినుంచీ తప్పించుకుంటున్నాడు? ఎక్కడికి పరిగెత్తుతున్నాడు? చివరికి ఏం సాధిస్తాడు? లక్ష్యం ఏమిటి? - ఈ ప్రశ్నకు సమాధానమే మేక్ గఫిన్! "నార్త్ బై నార్త్ వెస్ట్"లో హీరో పరారికి ఇదే సమాధానం. దమ్మున్న దర్శకుడు spot interest తో కథని ఊపిరి తిరగకుండా చెప్పగలిగితే ప్రేక్షకులు 'చెప్పడాన్ని' ప్రేమించినంతగా లక్ష్యాన్ని ఎదురుచూడరన్నది హిచ్ కాక్ గట్టి నమ్మకం. ఆయన తన సినిమాల్లో ఆ విషయాన్ని పదే పదే నిరూపించాడు. ఆ టెక్నిక్‌కి దాదాపు ప్రారంభం 39 మెట్లు.


Rupert Degas and Simon Gregor

అసలు ఈ 39 మెట్లు ఏమిటి? నవల ప్రకారం ఓ రహస్య ముఠాకి సంకేతం. ఈ ముఠా ఏం చేస్తోంది? ఎందుకు హీరోని వెంబడిస్తోంది? మొదటి రెండు సినిమాలలోనూ ఎవరూ చెప్పలేదు. అసలు ఆ సినిమాలలో మెట్లే లేవు! మూడో సినిమాలో క్లైమాక్సులో ఒక బాంబు పేలితే - మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమవుతున్నది ఒక సాకు - మేక్‌గఫిన్.

ఓ నిరపరాధి, నేలబారు మనిషిని ఓ అందమైన అమ్మాయి పలకరిస్తుంది. తనని ఇంటికి తీసుకెళ్ళమంటుంది హడావిడిగా. ఆ మనిషి షాక్ అవుతాడు. ఎందుకు? వద్దు అనేలోగా అతని భుజం పట్టుకుని అతని ఇంట్లోకి తోసుకు వస్తుంది. ఆమె ఎవరు? అలా రావడానికి కారణం ఏమిటి? అని అడిగేలోగా ఎవరో ఆమెని కాల్చి చంపారు. ఇక హత్యానేరం తన మీద పడకుండా తప్పించుకోవడం, వీలయితే హంతకుడిని పట్టుకోవడానికి ప్రయత్నం నాటకం. హీరో ఎవరి నుంచీ తప్పించుకుంటున్నాడు? ఎవరు హత్య చేశారో కనుక్కుంటాడా? తన ప్రాణాల్ని కాపాడుకుంటాడా? ఈ ప్రశ్నలన్నీ మన మనస్సుల్లో రూపుదిద్దుకోక ముందే ఊపిరి తిరగని సన్నివేశాలు ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. ప్రతిసారీ హీరో పోలీసుల్నుంచీ, ముఠానుంచీ తప్పించుకోవడం మనల్ని ఆహ్లాదపరుస్తుంటుంది. చివరికి దుర్మార్గుడు శిక్షింపబడతాడు. అసలు దుర్మార్గం అంటే ఏమిటి? ఈ 71 సంవత్సరాలలో ఆ ప్రశ్న ఈ మూడు సినిమాలు చూసిన ఎవరికీ రాలేదు! సెకనుకి 24 ఫ్రేములు కదిలే


Rachel Pickup

సినిమా వేగం ప్రేక్షకుల్ని జోకొట్టి, మోసం చేస్తుంది. ప్రేక్షకుడు ఆనందంగా మోసపోతాడు - నాటకాన్ని చూస్తూ. ఈ మోసాన్ని అధ్భుతమయిన `కళ`ని చేసిన దర్శకుడి కళాఖండం 39 మెట్లు. మేజిక్కుని చూస్తో లాజిక్కుకి ఆనందంగా విడాకులిచ్చేప్రక్రియని ప్రేక్షకులకి అలవాటు చేసిన ఘనత ఈ నాటకానిది - అంటే హిచ్‌కాక్‌ది - పరోక్షంగా.

చావుకి భయపడక, ధైర్యంగా అడ్డంకుల్ని అధిగమిస్తూ, మొండిగా, సాహసంతో దూసుకుపోయిన ఈ హీరో `రిచర్డ్ హనీ` బ్రిటిష్ సాహిత్యంలో, సినిమాల్లో ఒక బాణీకి మూలపురుషుడయాడు. `హనీ ధోరణి` అని స్థిరపడిపోయింది. ఈ ధోరణిలో చిత్రితమయిన ఓ గొప్ప పాత్ర (అలెక్ లీమాస్) ని "ది స్పై హూ కేమ్ ఫ్రం ది కోల్డ్" (1965)లో ప్రముఖ నటుడు రిచర్డ్ బర్టన్ చేశారు.

హనీ గురించి చాలా చక్కగా కరపత్రంలో వ్రాశారు ప్రదర్శకులు He is the perpetual winner par excellence and in an increasingly complex world his simple morality remains our anchor and our rock, the still reliable centre of a relentlessly changing universe…. And that’s probably why the majority of you are here in the audience tonight.”

సరే. సినిమాలో చూపించే పరుగులూ, వంతెనల మీద నుంచీ గెంతడాలూ, రకరకాల స్థలాల నుంచీ తప్పుకోవడాలూ, హోటల్ గదులులో సన్నివేశాలూ - అంతే వాస్తవంగా, అంతే చురుకుగా - అంతకు మించి అంతే వేగంతో స్టేజి మీదకి ఎలా తీసుకురావడం? "మిస్ సైగాన్" నాటకంలో స్టేజి మీదకి హెలికాప్టర్‌ని తీసుకొచ్చారు. "ది టైటానిక్" నాటకంలో ఓడని చూపారు. ఇది ఒక ఎత్తు. ఒక థ్రిలర్‌గా సాగే ఈ ఇతి వృత్తాన్ని - ఆద్యంతమూ హాస్యరస భరితమయిన ప్రదర్శనగా మలచడం ఎలా? ఆ ఒక్క కారణానికే ఈ నాటకం `ది థర్టీ నైన్ స్టెప్స్` చూడాలి.

ఇందులో పోలీసులున్నారు. ముఠా మనుషులున్నారు. రైతులున్నారు, హోటల్ సిబ్బంది ఉన్నారు, రైతు భార్య ఉంది - ఇలా 139 మంది ఉన్నారు. కేవలం నలుగురే నటులు ఆద్యంతమూ మీసాలు మార్చి, మేకప్పులు మార్చి, దుస్తులు మార్చి, నటనని మార్చి మేనరిజాలు కొత్తవి ఏర్పరుచుకుని - క్షణం ఊపిరి తిరగనివ్వకుండా రెండు గంటలసేపు ఒక `సాహస గాథ`ని హాస్య స్ఫోరకంగా రంగస్థలం మీద ప్రదర్శించారు. ఇది ఒక అద్భుతం. గార్డియన్ పత్రిక మాటల్లో చెప్పాలంటే “clever, very funny, imaginative and brilliantly enacted”




నాటకం అసాంతం mime, pantomime, improvisation, shadow play - మీ ఇష్టం అన్నీ ఉపయోగించారు. నాటకంలో విమానం చూపడానికి సరాసరి విమానాన్ని దింపడం అద్భుతం. కానీ విమానాన్ని సూచించడం కళ. అదీ నాటకీయత. పోరాటాలూ, వెంటాడడాలూ, దాగుడు మూతులూ - ఆ వేగమంతా సెకన్లు నష్టపోకుండా రెండు గంటల సేపు ఉక్కిరి బిక్కిరి చేస్తుంది నాటకం. యధాతథంగా చూపడం కాక సూచనని అందుకని దాన్ని ఆలోచనగా తన అనుభవంలోకి తర్జుమా చేసుకున్నందుకే మురిసిపోతాడు ప్రేక్షకుడుThe audience’s inerest is directly proportional to what is left unsaid and ambiguously hinted.

ఒక సన్నివేశంలో కుడి సైడ్ కర్టెన్ దగ్గర ద్వారం చట్రం తలుపు ఉంది. హీరో తలుపు కొట్టాడు. ఇటునుంచీ ఓ ముసిలావిడ (నటులలో ఒకరే!) తలుపు తీసింది. హీరో లోపలికి వచ్చాడు. వెంటనే చట్రాన్ని entre back stage కి మార్చారు. ఇప్పుడు స్టేజి అంతా హీరో వచ్చిన గది అయిపోయింది! ఇలాంటి improvisations నాటకమంతా కోకొల్లలు. ముఖ్యంగా సైమన్‌గ్రిగోర్ అనే సహనటుని నటన అపూర్వం. అతను చేసిన వివిధ పాత్రలకి ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. నాటక మంతా అయేసరికి - ఎంత విస్తృతమయిన పరిధిలో ఉన్న నాటకాన్ని ఎంత అలవోకగా రంగస్థల మీద కుదించి ఒప్పించారా అని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది ప్రదర్శన.

లబ్ధప్రతిష్ఠులయిన నటీనటులు, సాంకేతిక బృందం ఈ నాటక ప్రదర్శనకి వెన్నెముక. ప్రతి నటునికీ, నటికీ ఒక చరిత్ర ఉంది. వారంతా అంతో ఇంతో సినిమాలలో నటించినవారు. దర్శకత్వం మేరియా ఆట్‌కిన్ అనే ఆవిడ నిర్వహించారు. దర్శకులు అప్పుడప్పుడు మారుతూ తమ ప్రతిభని రంగరిస్తుంటారు. ఈ నాటకానికి తొలుత దర్శకత్వం వహించినది ఫియోనా బఫ్ఫినీ అనే మరో మహిళ. ఈ నాటకాన్ని ప్రదర్శించిన ట్రైసికిల్ అనే నాటక సంస్థ ఇప్పటికీ ప్రపంచమంతటా 25 లక్షల మంది సమక్షంలో ప్రదర్శనలు జరిపిందట.

సెంట్రల్ లండన్‌లో అండర్ గ్రౌండ్ స్టేషన్‌లోంచి బయటికి రాగానే - ఎదురుగా కనిపిస్తుంది - క్రైటీరియన్ అనే థియేటర్. సంప్రదాయాన్నీ, చరిత్రనీ భద్రంగా కాపాడుకునే బ్రిటిష్ వారసత్వానికి మచ్చుతునకలు - వెస్టెండులో ఈ నాటకశాలలు. 1870 ప్రాంతంలో ఇక్కడ ఒక సత్రం ఉండేది. ప్రస్తుతం రిజెంట్ సర్కస్ (జెర్మిన్ వీధి, పికడిల్లీ సర్కస్ మధ్య) ఉండే స్థలం పెద్ద పల్లపు భూభాగం. అక్కడ పెద్ద క్రైటీరియన్ రెస్టారెంట్, డైనింగ్ గదులు, మీద ఒక బాల్‌రూం నిర్మించారు. మరి ప్రత్యేకంగా పంపే ఏర్పాట్లు చేశారు. అంటే - ఆ రోజుల్లోనే - దాదాపు 130 సంవత్సరాల కిందట ఇక్కడ ఒక ఎయిర్ కండిషన్డ్ హాలు ఏర్పాటు అయింది.

దరిమిలాను - ఇది నాటక శాల అయింది. ప్రముఖ నటులు జాన్ గిల్‌గుడ్ చాలా నాటకాల్ని ఇక్కడ ప్రదర్శించారు. టెరన్స్ రాటిగన్ అనే బ్రిటిష్ రచయితకి ఇక్కడి ప్రదర్శన "ఫ్రెంచి వితవుట్ టియర్స్"తోనే మంచి పేరొచ్చింది.

రెండో ప్రపంచయుద్ధం రోజుల్లో బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పోరేషన్ (బిబిసి) ఇక్కడినుంచే ప్రసారాలను నిర్వహించింది. బేస్‌మెంటులో ఉండడం వల్ల రక్షణకూ, ప్రసారాలకూ ఇబ్బంది కలగలేదు. 1996 నుంచీ మొన్నటివరకు ఇక్కడ వరసగా షేక్స్పియర్ నాటకాలను ప్రదర్శించేవారు.

ఈ నాటకశాల వల్ల మరొక సుఖం ఉంది. నాటకం పూర్తయ్యేసరికి తేలికగా పదిన్నర అవుతుంది. చలికాలంలో చలి భయంకరమయిన స్థాయికి వచ్చే సమయం అది. నాటకశాల నుంచీ బయటికి వస్తూనే ప్రేక్షకులు - చాలా వరకు - రోడ్డు దాటి పిక ఢిల్లీ అండర్ గ్రౌండు స్టేషన్ వేపు దూకుతారు.

ఓ నవలా రచయిత రచననీ, ఓ మహా దర్శకుని ప్రతిభనీ 90 సంవత్సరాల తర్వాత (నవల రచనాకాలం 1914) కూడా అజరామరం చేసుకున్న ఓ గొప్ప నాటక రంగపు ఉజ్జ్వలమయిన చరిత్ర ఇది.

అన్నట్టు - ఈ నాటకం టిక్కెట్టు కేవలం 1200 రూపాయలు. ఆ రోజునే కొనేవారికి ఓ సౌకర్యం ఉంది. ప్రతి రోజూ లెస్టర్ స్క్వేర్‌లో 'సగంధర టిక్కెట్ల బూత్' దగ్గర ఆయా నాటకాల టిక్కెట్లు - సగం ధరకి దొరుకుతాయి. ఆ లెక్కన నేను కొన్న టిక్కెట్టు అసలు ధర 2,400 రూపాయలు!

✡✡✡

# బోయింగ్ బోయింగ్




ఈ విడతలో ఎంపిక చేసుకున్న అయిదు నాటకాలూ - ఏదో చరిత్ర గలవీ, లోగడ ఏదో కారణానికి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకొన్నవీను. ది థర్టీ నైన్ స్టెప్స్ 1935లో హాలీవుడ్‌లోనే హాలీవుడ్ చిత్రంగా ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ రూపొందించినది. బోయింగ్ బోయింగ్ కూడా హాలీవుడ్ చిత్రంగా పేరున్న నాటకం. ప్రముఖ అమెరికన్ రచయిత టెన్నిసీ విలియమ్స్ రచన 'ది గ్లాస్ మినేగరీ'. మరొకటి షేక్స్‌పియర్ నాటకం 'ఆంటోనీ అండ్ క్లియోపాత్రా'. చివరగా ప్రపంచ సాహిత్యంలోనే ఒక కళాఖండంగా నిలిచిన నవల ఆధారంగా తయారయిన సంగీత రూపకం 'లే మిజరబుల్స్'. రచయిత విక్టర్ హ్యూగో. ఈ నాటకాలు దేనికదే ప్రత్యేకతను సంతరించుకున్నవి. ప్రదర్శనలో వాటి వాటి కారణాలకి ప్రాచుర్యాన్ని పొందినవీను.




గత శతాబ్దపు ఆరవదశకంలో బ్రాడ్వేని ఊపి ఉర్రూతలూగించిన హాస్య నాటకం 'బోయింగ్ బోయింగ్', నిజానికి ఇది ఫ్రెంచి నాటకం. సునిశితమయిన హాస్యానికీ, సెక్సుకీ - రెంటి మేళవింపుకీ ఫ్రాన్సు పెట్టింది పేరు. పారిస్‌ని లలిత కళల పుట్టిల్లు అంటారు. నిజానికి బోయింగ్ విమానాల పుట్టిల్లు కూడా అదే. 1960 ప్రాంతాలలోనే ఈ విమానాల ప్రాచుర్యం పెరిగింది. ఇక ఎయిర్ హోస్టెస్‌లకి ఇదో కొత్త ప్రపంచం. ఆమెని గ్లామరస్ సెక్సు సింబలుగా ఆయా విమాన సంస్థలు ప్రచారం చేసేవి. కొత్త దేశాలకి వెళ్ళడం, కొత్త వాతావరణంలో మసలడం, కొత్త మనుషులూ, కావలసినంత డబ్బూ, గ్లామరూ, అన్నిటికీ మించి కొత్త ప్రేమ కథలూ...!



ఇదిగో, ఇక్కడ పుట్టిన కథే 'బోయింగ్ బోయింగ్', చిలిపిగా, అల్లరి ఆలోచనతో రూపు దిద్దుకున్న - అతి గడుసయిన - ఆద్యంతమూ గ్లామరస్ కథ ఇది. కావల్సినంత సెక్స్, లబ్జు, చిన్న సస్పెన్స్, బోలెడు అల్లరీ - వెరిసి - ఎన్నిసార్లు చూసినా హాయిగా నవ్వుకునే పారిహాసిక ఇది. ఆపోలో థియేటర్‌లో మొదటి విడతలో ఏడు సంవత్సరాలు నిరాఘాటంగా నడిచింది. 2000 ప్రదర్శనలు జరిగాయి. అటు తర్వాత పారమౌంట్ కంపెనీ జెర్రీ లూయిస్, టోనీ కర్టిస్, థెల్మా రిట్టర్‌లతో హాలీవుడ్ సినీమాగా తీశారు. అది దుమ్ము దులిపేసింది. 1991 లో ప్రపంచంలో అతి విరివిగా ప్రదర్శింపబడిన ఫ్రెంచి నాటకంగా ఇది గిన్నిస్ బుక్‌లోకి ఎక్కింది. జెనీవాలో పుట్టిన ఇటలీ దేశస్థుడు - ఫ్రెంచి పౌరుడిగా ఉంటూ ఈ నాటకం రాశాడు. అతని పేరు మార్క్ కామొలెట్టి. భోళా హాస్యానికీ, కుండ బద్దలు కొట్టే స్వభావానికీ 'ఇటలీ' దేశం పెట్టింది పేరు. ఫ్రెంచి పోకిరీతనం, ఇటలీ భోళాతనం - రెండు దేశాల హాస్యం మిళాయిస్తే ఏమవుతుంది? 'బోయింగ్ బోయింగ్' అవుతుంది.



అసలు ఈ నాటకం కథ ఏమిటి? బెర్నార్డ్ అనే చాలా సమర్ధుడయిన, అందమయిన, సంపన్నుడయిన ఆర్కిటెక్ట్. సరదా పురుషుడు. స్నేహితుల సహాయంతో ముగ్గురు అందమయిన ఎయిర్ హోస్టెస్‌ల పరిచయమయింది. ఒకరు అమెరికా అమ్మాయి. ఒకరు ఇటలీ అమ్మాయి. ఒకరు జర్మనీ అమ్మాయి. చాలా చక్కని ఇల్లు. అక్కడికి వారిని తీసుకువస్తుంటాడు. ఏ అమ్మాయి వచ్చినప్పుడు ఆ అమ్మాయి ఇష్టాఇష్టాల్ని పాటిస్తూ - వాళ్ళకి ఇష్టమయిన పువ్వుల్ని అలంకరించి, వారికి నచ్చిన వంటకాల్ని చేసిపెట్టే ఓ ముసలి వంటావిడ నిజానికి ఆమె ఆ ఇంటికి పెద్ద దిక్కు. సర్వస్వమూను. ఆవిడ ముగ్గురు ప్రేయసులకీ, ఎయిర్ హోస్టెస్‌లకీ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్! ముగ్గురి విమానాల వేళలూ కలియవు. ఇటలీ అమ్మాయిని విమానం ఎక్కించి జర్మనీ అమ్మాయిని ఆహ్వానిస్తాడు. జర్మనీ అమ్మాయి ఆకాశంలో ఉండగా అమెరికా అమ్మాయి ఇంట్లో ఉంటుంది. ఈ విధంగా బెర్నాడ్ జీవితం ముగ్గురు ప్రేయసులతో ఆనందంగా పైలా పచ్చీసుగా సాగిపోతోంది. ఇక్కడ నాటకం ప్రారంభమయింది. ఇప్పుడు ఓ పాత మిత్రుడు - రాబర్ట్ వచ్చాడు. ఈ ప్రేయసులతో చదరంగం, ప్రేమాయణం చూసి నివ్వెరపోయాడు. కానీ బెర్నార్డ్ గర్వంగా ప్రేయసుల రాకపోకలను తెలివిగా నిర్వహించడంలో తన చాకచక్యాన్ని వివరించాడు. అయినా రాబర్ట్‌కి ఆశ్చర్యమూ తగ్గలేదు, అనుమానమూ తగ్గలేదు. ఎప్పుడయినా ఏదయినా ఉపద్రవం వస్తే?

రానేవచ్చింది. ఉన్నట్టుండి విమానాల రాకపోకలు తల్లకిందులయ్యాయి. అమెరికా విమానం తొందరగా వెనక్కి వచ్చింది. జర్మన్ విమానం బయలుదేరడం ఆలశ్యమయింది. జర్మన్ విమానం ఇంకా గాలిలోకి లేవకుండానే ఇటలీ విమానం నేలమీదకి దూకింది. ముసలి ఇంటావిడ ఈ టెన్షన్ భరించలేక మూర్ఛపోయింది. రాబర్ట్ తన స్నేహితుడి పరువు కాపాడాలని - శతధా ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో జర్మన్ ఎయిర్ హోస్టెస్ ముద్దు 'పొరపాటున' తన కందింది. అక్కడితో తనూ ప్రేమలో పడ్డాడు. ఒక పక్క గందరగోళం, అర్ధాంతరపు ప్రేమ, రకరకాల ముద్దుల ప్రయోగాలు జరిపే అమెరికన్ ఎయిర్ హోస్టెస్ గ్లోరియా 'ముద్దు'ల దాడి - అయ్యా నాటకం ఒక ఆనంద కల్లోలం!



అద్భుతమైన యూనిఫారలతో - కళ్ళు చెదిరిపోయే రంగు సూట్లతో - ముగ్గురు ఎయిర్ హోస్టెస్‌లూ స్టేజిమీద తిరుగుతూంటే - సీతాకోకచిలుకలు ముసురుకున్న ఉద్యానవనంలాగ కనిపించింది వేదిక. ముగ్గురూ ప్రేక్షకుల మీద 'మరుల' వల పన్నేశారు. 'ఇతన్ని ప్రేమించకపోతే ఎలాగ?' అనిపించేంత అందగాడు బెర్నార్డ్. వీరి ప్రేమాయణం మధ్య నలిగిపోయే ఇంటావిడ (వంటావిడ) పాత్ర బెర్తా. ఈ పాత్రని ఫ్రాన్సిస్ డి లా టూర్ అనే నటీమణి అద్భుతంగా నటించింది. ఇక అమ్మాయిల దాడికీ, స్నేహితుడి పరువుకీ మధ్య నలిగిపోయే రాబర్ట్ పాత్రలో మార్క్ రైలాన్స్ అనే నటుడు అపూర్వంగా నటించాడు. చివరంటా ఊపిరి తిరగనంత వేగం, హాస్యం, వేడి వేడి ముద్దులూ, కావలింతలూ - అయితే ఎక్కడా అశ్లీలత లేదు - అది సమాజంలో అసాధ్యం కాదు అని గుర్తుంచుకొంటే.

చివరకు బెర్నార్డ్ నాటకం బయటపడదు. అమెరికా అమ్మాయి గ్లోరియా తనకు అసలైన ప్రియుడితో పొంతన కుదిరిందంటూ వెళ్ళిపోతుంది. జర్మన్ అమ్మాయి నిజంగానే రాబర్ట్ మిత్రుడితో ప్రేమలో పడుతుంది. ఇక రాబర్టుకి మిగిలింది గాబ్రియెల్లా ఒక్కరే. వారి వారి ప్రేయసులతో మిత్రులు సంతోషపడతారు. కథ సుఖాంతం.

కామెడీ థియేటర్‌లో నడిచిన చక్కటి కామెడీ ఇది.

ప్రతిరోజూ ప్రతీ ప్రదర్శనా ఆయా నటులే ప్రదర్శించ లేని పరిస్తితి రావచ్చును. ఎప్పుడయినా ఇబ్బందులలో పడినా, అవసరం వచ్చినా ఆయా పాత్రల్ని నటించడానికి వేర్వేరు నటులు తర్ఫీదులో ఉంటారు. వీరిని 'అండర్ స్టడీస్' అంటారు. వీరు కూడా విధిగా ప్రతిరోజూ ప్రదర్శనకి వచ్చి తీరాలి. దాదాపు నాటకం మూడొంతులు పూర్తయేవరకూ ఉండాలి. ఏదయినా కారణానికి ఏ నటుడయినా పాత్రని నటించలేకపోతే వీరు చటుక్కున ఆ పాత్రని పోషిస్తారు. ఇందులో ఇంటావిడకీ, ఇద్దరు మగాళ్ళకీ ఒకరు, ముగ్గురు ఆడపిల్లలకి

ఒకరు ఉన్నారు. మరి ఏదయినా కారణానికి ఇద్దరు అమ్మాయిలు ఇరకాటంలో పడితే? ఆనాటి ప్రదర్శన కుంటుపడాల్సిందే అయితే అది చాలా అరుదయిన సందర్భం. ఎక్కువగా వేషాలు లేక, కాస్త అనుభవం తక్కువగా ఉన్న నటీనటులు - సాధరణంగా ఈ అండర్ స్టడీస్‌గా ఉంటారు. వీరికి దక్కే ఆదాయమూ తక్కువే. మంచి వేషమో, మరేదో అవకాశమో వస్తే వీరు మాయమవుతారు. మనలాంటి వాళ్ళకి తెలీదు కానీ తరచు నాటకాలు చూసే ఇంగ్లండు ప్రేక్షకులకు ఈ నటీనటులు సుపరిచితులు. ఒకనాటి సర్ లారెన్స్ అలీవియర్, రిచర్డ్ బర్టన్, ఎడ్వర్డ్ ఫాక్స్ (ఇతని నాటకం "లెటర్ ఆఫ్ రెజిగ్నేషన్" ఈ కామెడీ థియేటర్‌లోనే నేను చూశాను), అలెక్ గిన్నిస్, జెస్సికా లాంగ్ - వీరందరూ ఒకనాటి స్టేజి నటులే. మనదేశంలో సినీ నటులు నాటకాల్లో నటిస్తే గ్లామర్‌గా చెప్పుకుంటారు గానీ, వెస్టెండులో, బ్రాడ్వేలో నటించే నటులు హాలీవుడ్‌లో నటించడం గొప్పగా చెప్పుకుంటారు. అది ఇక్కడి నాటక రంగ వైభవానికి ఉదాహరణ.

ఈ నాటకం దర్శకుడు మాథ్యూ వార్కస్. ఇతను దర్శకత్వం వహించిన నాటకాల జాబితాను చూస్తే నాలాంటి వాడికి ఒళ్ళు పులకరిస్తుంది. నాటక రంగంలో పండి, తలమునకలయిన అదృష్టవంతులు వీరంతా. రాయల్ షేక్స్‌ఫియర్ కంపెనీ 'వింటర్స్ టేల్', 'మచ్ ఎడో ఎబౌట్ నథింగ్', 'హామ్లెట్' వంటి నాటకాలకు దర్శకత్వం వహించాడు. ఉత్తమ దర్శకుడిగా అలీవియర్, టోనీ అవార్డులకి ఈయనకి నామినేషన్లు దక్కాయి. నాటకం పేరు - ఫిడ్లర్ ఆన్ ది రూఫ్. ఇలా వ్రాసుకుంటూ పోతే ప్రతీ నటుడికీ, దర్శకుడికీ, సెట్ డిజైనర్‌కీ - అందరికీ అన్ని చరిత్రలున్నాయి. కేవలం 4000 రూపాయలు ఖర్చు చేసి (ఇది మొదటి తరగతి టిక్కెట్టు) నాటకం చూడడానికి ఉత్సాహపడేవారిని ఆకర్షించడానికి - ఇంత అనుభవం కలిగిన కళాకారులను సమీకరించడంలో ఆశ్చర్యం లేదు. ఇంగ్లండులోనే "నాటకం చూడడం చాలా డబ్బుతో కూడిన పని" అనుకునేవారూ ఉన్నారు. అదే పనిగా చూసేవారూ ఉన్నారు. నేను మన దేశంలో సీనియర్ సిటిజన్‌ని కానీ - ఆ దేశంలో అయితే కొన్ని రాయితీలు దక్కేవి. కొన్ని సౌకర్యాలూ ఉన్నాయి. అయినా "మీరు సీనియర్ సిటిజనా?" అని అడిగి చక్కని సీటుని బుకింగ్‌లో కూర్చున్న అమ్మాయి నాకూ ఇచ్చింది. అలాగే ఒక బృందంగా వచ్చేవారికీ, స్కూలు పిల్లలకీ రాయితీలుంటాయి. ఎవరయినా, ఎక్కడినుంచయినా టిక్కెట్టు కొనుక్కోవడానికి ఇంటర్నెట్‌లో వెబ్‌సైట్ ఉంటుంది. (www.boeingboeing.co.uk చూడండి) కరపత్రాలలో ఏ అండర్ గ్రౌండు స్టేషన్‌లో దిగాలో, ఏ బస్సుల్లో థియేటర్‌కి రావచ్చునో వ్రాస్తారు. లండన్ థియేటర్ గైడ్‌లో ఆ థియేటర్ ఏ వీధిలో ఎక్కడ ఉన్నదీ చూపే ఒక పటం ఉంటుంది సాధారణంగా రాత్రి ఆటలు కాక బుధవారం, శనివారం రాత్రి ఆటలు కాక మాటనీలుంటాయి.

కామెడీ థియేటర్ హేమార్కెట్ వీధిలో (పికడిల్లీకి ఎదురుగా) హెర్ మెజస్టీ థియేటర్‌కి ఎదురుగా ఉన్న ఫాంటన్ స్ట్రీట్‌లో ఉంది.ఇప్పుడు కాదుగానీ దాదాపు శతాబ్దం కిందట ఈ వీధికి ఒక ప్రత్యేకత ఉండేది. ఆ రోజుల్లో ఇక్కడ చీకటి సెక్స్ వ్యాపారం జరిగేదట పోను పోను ఆ ఆ ధోరణి మారింది. 1881లో థామస్ వెరిటీ ఆధ్వర్యంలో కేవలం ఆరు నెలలలో ఈ థియేటర్‌ని కట్టారు. దీనికి మొదట 'రాయల్ కామెడీ థియేటర్' అని పేరు పెట్టారు కానీ సాధికారికమయిన అనుమతి లేని కారణాన బకింగ్‌హామ్ పాలెస్ పేరులో 'రాయల్'ని తీయించేసింది. అప్పుడిక కామెడీ థియేటరు మిగిలింది.

ఆ రోజుల్లో నటులే థియేటర్లను గుత్తకు తీసుకుని నడుపుకునేవారు. నిజానికి షేక్స్‌ఫియర్ "గ్లోబ్" థియేటర్‌ని నడిపేవాడు. ఆ రోజుల్లో వారి ప్రాచుర్యం, విరివిగా నాటక ప్రదర్శనలూ - ఆ పనికి కిట్టుబాటుగా ఉండేవి. ఆ రోజుల్లో ఈ కామెడీ థియేటరుని నడిపిన మహానటులు - ప్రముఖ నటుడు సర్ హెర్బర్ట్ బీర్‌బోం ట్రీ, సర్‌చార్లెస్ హాట్రీ, అలెగ్జాండర్ హెండర్‌సన్ మున్నగువారు.

ప్రపంచ యుద్ధం తరువాత థియేటర్‌లో కొన్ని మార్పులు చేశారు. మేకప్ గదులు సౌకర్యవంతంగా నిర్మించారు.

ప్రతిదేశానికీ కొన్ని ఆంక్షలుంటాయి. ఆచారాలుంటాయి. ఆక్షేపణలుంటాయి. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి రోజుల్లో సనాతన కుటుంబాల్లో చొక్కా తొడుక్కోడం నిషిద్ధం. ఆయనకి చొక్కా తొడుక్కోవాలని సరదాగా ఉండేదట. ఒక చొక్కా కుట్టించుకుని వీధి చివర

ఇంటి చూరులో దాన్ని దాచుకుని ఇంటికి వచ్చేవారట. ఆ రోజుల్లో సద్బ్రాహ్మణ కుటుంబాల్లో క్రాఫింగు పెట్టుకుంటే చిన్న చూపు చూసేవారు. ఇప్పటికీ పై కండువా తప్ప చొక్కా తొడగని పండితులున్నారు.

ఇంగ్లండులో ఏకలింగ సంపర్కం ఒకప్పుడు నిషిద్ధం. నేరం. అదే నేరానికి ఓ గొప్ప రచయిత ఆస్కార్ వైల్డ్‌ని జైలుకి పంపారు. అయితే ఆయన నాటకాలు వెస్టెండులో ప్రదర్శించేవారు. ఆయన పేరు లేకుండా ఆయన నాటకాన్ని ప్రచారం చేసిన కరపత్రం నా దగ్గర ఉంది. ఇది ఒక అరుదైన సంఘటన. విచిత్రం ఏమిటంటే దరిమిలాను బ్రిటన్‌లోనే ఏకలింగ సంపర్కాన్ని చట్టబద్ధం చేశారు. ఆ ఇతివృత్తంతో ఎన్నో సినిమాలు ఇటీవల వచ్చాయి.

అయితే - ఆ రోజుల్లో ఇలాంటి నాటకాలను ప్రభుత్వ యంత్రాంగం విధిగా అందరూ చూడడాన్ని నిషేధించేది. మరి కొందరు మేధావి వర్గమో, పాటక ప్రియులో వాటిని చూడాలంటే ఎలాగ? అప్పుడూ కొన్ని థియేటర్ల మేనేజర్లు ఏకమయి న్యూ వాటర్ గేట్ థియేటర్ క్లబ్ అనే సంస్థ ప్రారంభించారు. అన్ని చోట్లా నిషేధించిన నాటకాలను కామెడీ థియేటర్‌లో ఈ క్లబ్బు సభ్యులు చూసేవారు. నాటకరంగంలో అయిదు గొప్ప నాటకాల పేర్లు తలచుకుంటే అలనాటి రాబర్ట్ ఏండర్సన్ నాటకం 'టీ అండ్ సింపథీ' తప్పనిసరిగా ఉంటుంది. ఏకలింగ సంపర్కం ఇతివృత్తంగా ఏ మాత్రం వెగటూ, బూతూ లేకుండా ఎంతో కళాత్మకంగా చేసిన గొప్ప రచన ఇది. అంతే కాకుండా ఆర్థర్ మిల్లర్ "ఏ వ్యూ ఫ్రం ది బ్రిడ్జ్" తొలి ప్రదర్శన ఇక్కడ జరిగింది. ఆ ప్రదర్శనకి ఆర్థర్ మిల్లర్, ఆయన భార్య, ప్రపంచ సౌందర్య రాశి మార్లిన్ మన్రో, సర్ లారెన్ ఆలీవియర్, ఆయన సతీమణి, ప్రముఖ నటి వివియన్‌లీ (స్ట్రీట్ కా నేమ్డ్ డిజైర్ సినిమా గుర్తుందా?) హాజరయారు. ఇక్కడే టెన్నిసీ విలియమ్స్ 'కాట్ అనె హాట్ టిన్ రూఫ్' (సినిమాలో ఎలిజబెత్ టైలర్ నటించింది) ప్రర్శించారు. క్రమంగా ఆంక్షలు తగ్గి న్యూవాటర్ గేట్ క్లబ్బు అవసరం తగ్గింది. మరో మూడేళ్ళ తర్వాత క్లబ్బు మూతబడింది.




నోబెల్ బహుమతి గ్రహీత హెరాల్డ్ పింటర్ నాటకాలను ఇటీవలి కాలంలో ఇక్కడ ప్రదర్శించారు. కేర్ టేకర్, నోమాన్స్ లాండ్, మూన్ లైట్, ది హాట్ హౌస్, ది హోం కమింగ్ వంటి పేర్లు నాలాంటి వాడికి కితకితలు పెడతాయి. అలనాటి నాటకాల పోస్టర్లను నాటకశాల ప్రాంగణంలో ఇప్పటికీ ఉంచారు. సంప్రదాయం ఈ దేశపు ఊపిరి. చరిత్ర ఈ జాతి ప్రాణం. నాటకం ఈ దేశీయుని వ్యసనం.

మనలాంటి దక్షిణాది వారికి మరొక విచిత్రకరమయిన ఆకర్షణ ఇక్కడ ఉంది. కామెడీ థియేటరుకి ఎదురుగానే ఉడ్‌లాండ్స్ హోటల్ ఉంది. ఇక్కడ ఇడ్లీ 180 రూపాయలని గుర్తుంచుకుంటే మన దేశంలో ఎక్కడ ఇడ్లీ తిన్నా రుచికరంగానే కనిపిస్తుంది. భోజనం 700 రూపాయలు!

థియేటరు చరిత్రని తలుచుకుంటూ ఓ చలికాలపు సాయంకాలం కామెడీ థియేటరులో కడుపుబ్బ నవ్వించే హాస్య ప్రదర్శన చూడడం చక్కటి అనుభవం. నాటకం పూర్తయ్యాక ఒక డిగ్రీ చలిలో పిక డిల్లీ అండర్ గ్రౌండు స్టేషన్‌లోకి అయిదు నిముషాల్లో దూకవచ్చు. అదొక వెచ్చటి ఆలోచన.

✡✡✡

# "లే మిజరబుల్స్"



మంచుతో నిండిపోయిన చెట్టు

ముందు రోజంతా బిబిసిలో రాత్రి మంచు పడుతుందని చెపుతూనే ఉన్నారు. నేనేమో మన ఛానల్స్‌లో వాతావరణ సూచనలాగ "చెదురు మదురు జల్లుల" కథ అనే సరిపెట్టుకున్నాను. తీరా ఉదయమే కళ్ళిప్పి బయటికి చూస్తూనే కొయ్యబారిపోయాను. ధారాపాతంగా మంచు వర్షిస్తోంది. కనుచూపు మేర ఇళ్ళూ, వాకిళ్ళూ, చెట్లూ, కార్లూ - అన్నీ మంచులో మునిగి ఉన్నాయి. సన్నటి దూది పొరల్లాగ మంచు - చెట్ల ఆకులన్నీ మంచు ముద్దలతో బరువెక్కిపోయాయి. ఇంటి ముందు కారు ఓ చిన్న మంచు కొండలాగ ఉంది. నా జీవితంలో మంచు కురవడాన్ని చూడటం అదే మొదటిసారి. బయట - 5 డిగ్రీల చలి. అంతటా అయిదారు అంగుళాల మంచు పేరుకుని ఉంది. నిన్నటి ఆకుపచ్చని పచ్చిక అంతా మెత్తటి ముఖమల్ దూది పరుపు పరిచినట్టుంది. పక్షులు ఎగరడం లేదు. రెక్కలు మీదకి జారే మంచుని తదేకంగా దులుపుకుంటున్నాయి. ప్రకృతి మంచు బరువుకి నిండు చూలాలిలాగ ఒగరుస్తున్నట్టుంది. మధ్యాహ్నం వరకు అలాగే మంచు కురుస్తోంది. నేనున్నది డాక్టర్ పాల్ గారిల్లు. ఆయన పారతో కారు మీద మంచుని దులుపుకుని - రోడ్డుమీద మంచుని పక్కకి తోసుకుని క్లినిక్కి వెళ్ళిపోయారు. అడపా దడపా తప్పనిసరయిన కార్లు నడుస్తున్నాయి. తప్పని సరయితేనే తప్ప ఇళ్ళు కదలవద్దని టీవీల్లో చెపుతున్నారు.




మంచు వర్షాన్ని చూస్తుంటే రెండు చిన్నగేయాలు మనస్సులో కదిలాయి:

ఆకాశం మంచు కురుస్తున్నప్పుడు
ప్రతి చెట్టూ మల్లెపువ్వల్లే పూస్తుంది
మంచుకుంచెతో మట్టిబెడ్డ అలంకరించుకుని
పత్తి పింజెలాగ ఒళ్ళు విరుచుకుని పలకరిస్తుంది

మరొకటి -

నిన్న ఇంటి ముందు అసహ్యంగా నిలిచిన ముళ్ళడొంక
రాత్రి మంచు అంగీ తొడుక్కుని వెన్నెల నక్షత్రంలాగ మెరుస్తోంది
పనికిరాని వస్తువుని కూడా పవిత్రంగా
అలంకరించే సమదర్శి ప్రకృతి -

లేదా

ప్రకృతి చూపుని సంస్కరించి

అభిప్రాయానికి కొత్త అభిరుచిని సంతరిస్తుంది -

ఈ ముళ్ళడొంక ఫోటో తీశాను.

తీరా ప్రతిరోజూ ఓ నాటక చూడాలన్న నా కోరిక ఈ రోజు తీరదేమోనని బెంగపట్టుకుంది. మంచు వర్షం తగ్గాక రోడ్డు పక్క పేవ్‌మెంట్ల మీద మంచు మీద గడ్డ కట్టి దాని మీద జారిపడటం మామూలట. అలాగే వాహనాలూ జారి ఆక్సిడెంట్లు అవుతాయట.

సాయంకాలం 5 గంటలకి లేచేసరికి మంచు మాయమైంది. అలసిపోయినట్టు ప్రకృతి అంతా బరువుగా, మౌనంగా ఉంది. ఆరోజు చూడాలనుకున్న నాటకం 'లే మిజరబుల్స్', సంగీత నాటకం. పికడిల్లీ పక్క రోడ్డు స్ట్రాట్‌బరీ అవెన్యూలో 50 గజాల దూరం క్వీన్స్ థియేటర్. "వెళ్ళనా?" అని డాక్టరుగారికి ఫోన్ చేశాను. "ఏం ఫరవాలేదు. వెళ్ళిరండి" అన్నారాయన. అంతే. వెంటనే టాక్సీలో దూకేశాను.

రోజూ ఉదయం కొనుక్కునే టిక్కెట్టు కొనుక్కోలేదు. అయినా ఈ 0 డిగ్రీల చలిలో నాటకం చూడాలనే నాలాంటి వీరాభిమాని




ఎవరుంటారనుకుంటూ పిన్నెర్ స్టేషన్ నుంచి మూడు రైళ్ళు మారి పికడిల్లీలో దిగాను. క్వీన్స్ థియేటర్‌లో బాక్సాఫీసు తెరిచి ఉంది. 20 పౌన్ల (అంటే 1600 రూపాయల) టిక్కెట్టు దొరికింది. "నువ్వు సీనియర్ సిటిజనా?" అని అడిగి మరీ ఇచ్చింది బాక్సాఫీసు అమ్మాయి. కారణం? నా వెనక కొనుక్కున్న ఓ జపాన్ యువకుడు - పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆఫీసరు - నా పక్కనే కూర్చున్నాడు. అతని టిక్కెట్టు ఖరీదు 50 పౌన్లు (400 రూపాయలు)! రోజులో పనిపూర్తయాక - ఏ నాటకం బాగుంటుందని హోటల్ సిబ్బందిని అడిగాడట. వారు 'లే మిజరబుల్స్' సూచించారు. వచ్చాడు.

సాహిత్య రంగంలో, నాటక రంగంలో, సినిమా రంగంలో - 'లే మిజరబుల్స్'కి దక్కినంత గౌరవము, సాధించినన్ని విజయాలు ప్రపంచంలో మరే రచనా సాధించలేదు. ఈ సంగీత నాటకం కేవలం 21 సంవత్సరాలుగా లండన్‌లో ప్రదర్శింపబడుతూ రికార్డుని సృష్టించింది. గిన్నిస్ బుక్‌లోకి ఎక్కింది. ఈ రచనకి సంబంధించిన ఏ విషయమయినా చరిత్రే. అపురూపమయిన, అనితరసాధ్యమైన, చరిత్ర.

అసలు ఈ 'లేమిజరబుల్స్' సృష్టికర్త ఎవరు? అతని కథ ఏమిటి? నిజానికి అది మరొక చరిత్ర. రచయిత విక్టర్‌హ్యూగో పేరు చెప్పగానే 'హంచ్ బాక్ ఆఫ్ నోటర్ డామ్' నవల గుర్తుకొస్తుంది నాకు. నేను ఫ్రాన్సులో నోటర్ డామ్ కెథిడ్రల్‌కి వెళ్ళాను. అంతకు మించిన దీ నవల - 'లే మిజరబుల్స్', అదొక ఇతిహాసం.


విక్టర్ హ్యూగో

హ్యూగో నెపోలియన్ యుద్ధకాలంలో పుటాడు. తండ్రి సైన్యంలో జనరల్. ఆయన పదహారో ఏట తల్లితండ్రులు విడిపోయారు. 18 వ ఏట 28వ లూయీ మేనల్లుడి హత్యమీద కొన్ని పద్యాలు రాశాడు. రాజుగారు సంతోషించి సాలీనా 3 వేల ఫ్రాంకుల ఆదాయాన్ని మంజూరు చేశారు. ఇటీవల శివాజీ గణేశన్‌కీ, మంగళంపల్లి బాలమురళీకృష్ణగారికి ఫ్రెంచి ప్రభుత్వం ఇచ్చిన షావిలియర్ గౌరవాన్ని అలనాటి ఫ్రెంచి ప్రభుత్వం (10 వ చార్లెస్ రాజు) ఆయనకి 23 వ ఏటనే ఇచ్చింది! 1828-30 మధ్యకాలంలో హ్యూగోని నాటక రంగం ఆకర్షించింది. 'హెర్నానీ' అనే నాటకం రాశాడు. అయితే ఆ రోజుల్లోనే ఆదర్శ వాదులు స్వాప్నికుల (రొమాంటిక్స్) మధ్యతగాదాలు జరుగుతుండగానే వంద ప్రదర్శనలు జరిగాయి. ఈ సమయంలో జూలియట్ డ్రోన అనే నటితో స్నేహం కలిసింది.

అయితేవారిద్దరూ ఒకచోటే కలిసి జీవించలేదు. ఆయనింటికి నడక దూరంలో ఉండేదావిడ. చచ్చిపోయేవరకూ రోజుకో ఉత్తరం వ్రాసేది. ఈ స్నేహం 50 సంవత్సరాలు సాగింది!

ఎడతెగక రచనలు చేసే అలవాటు హ్యూగోకి. నోటర్ డామ్ రచన ఆ రోజులనాటిదే! 30 వ ఏటికే ఫ్రాన్సులో అతి ముఖ్యమయిన రచయితగా పేరొచ్చింది. లూయీ ఫిలిప్పే ఇతనికి 'పీర్'గా గుర్తింపు నిచ్చారు. 1845లో 'లే మిజరబుల్స్' రచనని ప్రారంభించాడు హ్యూగో.

లూయీ తదనంతరం జాతీయ అసెంబ్లీకి ఎన్నికయి - అప్పటి లూయీ నెపోలియన్‌ని వ్యతిరేకించాడు. 1851 లో నెపోలియన్(||) పదవిలోకి రాగానే హ్యూగో దేశం వదిలి బ్రస్సెల్స్ పారిపోవలసివచ్చింది. తరువాత గురెన్సీ చేరాడు. 1861 నాటికి లే మిజరబుల్స్ రచన పూర్తయింది. మొదటి ప్రచరణ కాగానే హ్యూగో ప్రచురణ కర్తకి ఓ టెలిగ్రాం పంపాడంట. విషయం -"?" అని. ప్రచురణకర్త నుంచీ సమాధానం - "!" అని. మొదటి ఆరేళ్ళలో 5 లక్షల ఫ్రాంకులు ప్రచురణకర్తకు సంపాదించి పెట్టిందీ రచన.

1870లో ఫ్రాంక్ పర్షియన్ యుద్ధంలో నెపోలియన్ (|||) ఓడి దేశాన్ని వీడిపోయినప్పుడు హ్యూగో గర్వంగా పారిస్ నగర ప్రవేశం చేశాడు. మరికొన్ని రాజకీయ పరిణామాల అనంతరం - 1878లో స్వల్పంగా పక్షవాతం వచ్చేవరకూ పుంఖానుపుంఖంగా రచనలు చేస్తూనే ఉన్నాడు. మూడేళ్ళ తర్వాత - ఆయన 80 వ జన్మదినాన అభిమానులు ఆయన ఇంటి ముందు ఆయనగౌరవార్ధం పెద్ద ఊరేగింపు జరిపారు. అప్పటికి హ్యూగో ప్రపంచ ప్రఖ్యాత రచయిత. 1885లో - తన 83 వ ఏట హ్యూగో కన్నుమూశాడు. అతి సామాన్యమయిన అంత్యక్రియల్ని హ్యూగో కోరుకున్నాడు. అయితే మహానుభావులు కిచ్చే వీడ్కోలు ఫ్రెంచి ప్రజలు ఆయనకిచ్చారు. అర్క్ డి ట్రోంఫీ దగ్గర ఆయన మృతదేహాన్ని ఉంచారు. ఊరేగింపు అక్కడి నుంచి కదలడానికి ఆరుగంటలు పట్టిందట. అదీ ఆనాటి ప్రజాసందోహం తమ అభిమాన రచయితకి ఇచ్చిన వీడ్కోలు! విక్టర్ హ్యూగో ఫ్రెంచి దేశపు ముద్దుబిడ్డ. జాతి చైతన్యానికి చిహ్నం.

**నవల చరిత్ర**

పతితులు, భ్రష్టులు, బాధా సర్ప దష్టుల కథ లే మిజరబుల్స్. వారి జీవన సరళి, దయనీయ స్థితిగతులు - అంతకుమించి ఆ దశకీ వారి గుండెలు నిండిన ఆర్ధ్రత, ప్రేమ, సాహసం, త్యాగం, వీరత్వం - ఒకటేమిటి? - ఆ వర్గం యొక్క సమగ్రమయిన ఇతిహాసం లే మిజరబుల్స్. ఇంత సమగ్రంగా, ఇంత అద్భుతంగా ఆ వర్గపు జీవితాన్ని ప్రతిఫలించిన రచన ప్రపంచ సాహిత్యంలోనే లేదంటే అతిశయోక్తి కాదు. 1865 లో ఈ పుస్తకం అచ్చయినప్పుడు - కేవలం 30 లక్షల కాపీల్ అమ్ముడుపోయాయట! హారీ పోటర్‌లకూ, షిడ్నీషెల్టన్‌లకూ అలవాటు పడిన ఈ తరానికి ఈ అంకె విచిత్రంగా కనిపించకపోవచ్చు. కానీ 142 సంవత్సరాల కింద ఇది ఒక దేశంలో ఒక నవల ప్రాచుర్యం అని గుర్తుంచుకుంటే దిగ్భ్రమ చెందక తప్పదు.

ఇక సినిమాల సంగతి. ఒక్క తెలుగుదేశంలోనే ఈ కథని సినీమాగా రెండు సార్లు యధాతథంగా నిర్మించారు. కాపీలూ, అనుసరణలూ సరేసరి. మొదటి చిత్రం "బీదలపాట్లు"లో హీరో నాగయ్యగారు. రెండో సినిమా తన బాణీని పక్కకి పెట్టి ఒకే ఒక్కసారి విఠలాచార్య ఈ కథని తెరకెక్కించారు. ఒకే ఒక్కసారి విఠలాచార్య సినిమాలో అక్కినేని హీరోగా నటించారు అదీ ఈ కథ మీద కళాకారుల వ్యామోహం. దాదాపు 40 సంవత్సరాల క్రితం మేజర్ సుందరరాజన్ నటించిన తమిళ నాటకాన్ని చూశాను నేను. నాటకంగా రూపుదిద్దుకోవడం అప్పటికది - ఆ భాషలో రెండవసారో, మూడోసారో! ఇక ప్రపంచంలో ఏ దేశమూ ఈ కథని చిత్రంగా తీయకుండా విడిచిపెట్టలేదు. దాదాపు 51 చిత్రాలు ప్రపంచమంతటా ఈ ఇతివృత్తంతో నిర్మితమయాయట!

విచిత్రమేమిటంటే - చాలామంది నిర్మాతలూ, దర్శకులూ - ప్రయత్నించి కూడా ఈ నవల పేరు మార్చలేకపోయారు. హ్యూగో తన నవలకి మొదట 'మిజరీ' (దైన్యత) అని పేరు పెట్టారు. భయంకరమయిన పేదరికం, అనాధల దైన్యతకు సంబంధించిన కథ ఇది. ఈ నవలలో పాత్రలు కేవలం పేదలు, పీడితులే కాదు. సమాజం చేత వెలివేయబడిన వారు, తిరస్కృతులు, తిరుగుబాటుదారులు -

అంతావున్నారు. తీరా నవల పూర్తయేసరికి రచయితే "లే మిజరబుల్స్" (పీడితులు) అని పేరు పెటారు.
'లే' అనేది ఫ్రెంచి భాషలో (నామవాచకం) ప్రపంచంలోకల్లా అతి పాపులర్ రచనలకి - ఏ దేశంలోనయినా, ఏ భాషలోనయినా - అదే శీర్షిక ఈనాటికీ నిలిచిపోయింది. 1909లో అమెరికాలో ఒక మూకీగా తయారయింది. 1982 లో టీవీ సీరియల్ అయింది. 1913లో ఫ్రాన్స్‌లో 12 రీళ్ళ సినిమా అయింది. ప్రతీ ప్రయోక్త కథ 'లే మిజరబుల్స్'ని తెరకెక్కించడం. 1925 లో హెన్రీ ఫెస్కో అనే ఫ్రెంచి నిర్మాత 32 రీళ్ళ సినిమాని రెండు భాగాలుగా తీశాడు.

1926లో ఇద్దరు మహానటులు - ఫ్రెడిక్ మార్చ్, చార్లెస్ లాటన్‌లతో ట్వంటీయెత్ సెంచరీ ఫాక్స్ సంస్థ చిత్రాన్ని నిర్మించింది. అయితే 1946లో ఇటలీలో మరొక అనూహ్యమయిన చిత్ర నిర్మాణం జరిగింది. ఆ చిత్రంలో మహానటులు లేరుగాని - వారి లేని లోటు కనిపించనిస్థాయిలో చిత్రాన్ని నిర్మించారు. నాలుగు నెలలపాటు 400 గుర్రాలతో, 4 వేలమంది మనుషులతో, 500 కాస్ట్యూములతో, 200 విగ్గులతో అతి విస్తృతంగా ఈ షూటింగు సాగింది. కేవలం చిత్ర నిర్మాణానికి గాను ఈ చిత్రం రికార్డు పుస్తకాల్లో చోటు చేసుకుంది, బ్రిటన్ టీవీలో రిచర్డ్ జోర్డన్, ఆంథోని పెర్కిన్స్ నటించారు. అయితే చిన్న చిన్న పాత్రలకి పెద్ద పెద్ద నటుల్ని - జాన్ గిల్‌గుడ్, ఫ్లోరా రోబ్సన్, సిరిల్ కుశాఖ్‌లాంటి వారిని వాడారు. వారు తెర మీద కనిపించినప్పుడు మరే పాత్రా ప్రేక్షకులకి గుర్తురాలేదు. అదీ ఆ నటుల - అంతకు మించి ఆ పాత్రల ఔన్నత్యం.

ఇంత ప్రాచుర్యం సంపాదించడానికి ఆ నవలలో ప్రాచుర్యం ఏమిటి పారిస్‌లో ప్రచురితమయినప్పుడు 24 గంటలలో 7 వేల కాపీలు అమ్ముడు పోయాయట. ప్రపంచ చరిత్రలోనే ఎక్కువ కాపీలు అమ్ముడు పోయిన నవలలో ఇది ఒకటి. పారిస్, బ్రస్సెల్స్, లండన్, మాడ్రిడ్ - ఇలా అన్ని దేశాల ముఖ్య పట్టణాల పేర్లూ చెప్పుకుంటూ పోవాలి. దీని ప్రాచుర్యం చెప్పాలంటే ఒక్క ఉదాహరణ చాలు - ఇప్పటికీ - దాదాపు 150 సంవత్సరాల తర్వాత ఒక్క బ్రిటన్‌లో సాలీనా 50 వేల కాపీలు అమ్ముడుపోతాయట!

మామూలు మట్టిని బంగారం చెయ్యగల అపురూప శిల్పి, 50 సంవత్సరాలు నిరాఘాటంగా హిట్ చిత్రాలు నిర్మించిన దర్శకుడు ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ - ఆ రోజుల్లోనే 'లేమిజరబుల్స్' చదివి "ఇది అద్భుతమయిన సంగీత నాటకం అవుతుంది" అన్నాడట ఎంత దూర దృష్టి! ఎంత ఆలోచన! సరిగ్గా ఆయన ఊహించినట్టే - మరో పాతికేళ్ళ తర్వాత మరో పాతికేళ్ళు నడిచే అద్భుతమయిన సంగీత నాటకంగా 'లే మిజరబుల్స్' రూపు దిద్దుకుంది.

ఇప్పటికీ ఈ నాటకం 38 దేశాలలో ప్రదర్శింబడుతోంది. ఇంగ్లండు, అమెరికా, జపాన్ ఇజ్రేల్, హంగేరీ - ఇలా ప్రపంచ పఠాన్ని ఇక్కడ ఉటంకించాలి. అచిరకాలంలో - 2008 నాటికి చైనాలో ఈ నాటకాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి - ఆ భాషలోకి అనువదించి. షాంగాయి, బైజింగ్‌లలో సంగీత నాటక పరిశ్రమ స్థాపనకి కృషి జరుగుతోంది. ఇప్పుడు సామాజికులకీ, జిజ్ఞాసులకీ ఒక ప్రశ్న మనసుల్లో కదలాలి. ఈ దేశాల జాబితాలో భారతదేశం పేరు లేదేం? మన దేశంలో, మన భాషలో ఈ అద్భుతమయిన నాటకాన్ని చూసే అదృష్టం లేదా? దీనికెవరు సమాధానం చెపుతారు? ఈ ప్రశ్నకి సమాధానం దొరకకే ఆ ప్రయత్నం నిలిచిపోయిందేమో. మనది ప్రజాస్వామిక దేశం. ఎవరికీ ఏదీ పట్టదు - తమ స్వార్థం తప్ప. కళా, దాని పరాకాష్ఠా ఎవడిక్కావాలి?

ఇంత చెప్పాక - ఇప్పటికయినా ఈ నవలలో ఇతివృత్తం ఏమిటి? అన్న ఆసక్తి కలుగుతుంది. ఇతివృత్తాన్ని నాటకం నడిచిన పద్ధతిలోనే వివరిస్తాను. ఇది రెండంకాల నాటకం. కానీ ఇందులో ఎన్ని సన్నివేశాలు? ఎన్ని యుద్ధాలు? సొరంగాలలో పాత్రల పరుగులూ, పాలెస్ తోటలలో ప్రేమికుల కలయిక, తుపాకులతో తిరుగుబాటుదారులకీ ప్రభుత్వ సైన్యాలకీ పోరాటం, విలన్ నీటిలో దూకి మరణించే సన్నివేశం - ఊపిరి తిరగని వేగంతో - సంగీత ప్రధానంగా మూడు గంటల సేపు ఉక్కిరి బిక్కిరి చేసే ప్రదర్శన ఇది. ఇక అర్థమయ్యేటట్టు స్థూలంగా చెప్పడం మంచిది.

**మొదటి అంకం**

ఒక ముఠాలో 19 సంవత్సరాలుండి బయటపడతాడు జీన్ వాల్ జీన్ (ఈ పేరు ఉచ్చారణ నిజానికి తప్పు. అయినా అలవాటయిన పొరపాటు మన ఆలోచనల్ని చెదరగొట్టదు కనుక అలాగే భావిద్దాం) సంఘం, చట్టం అతన్ని నేరస్థుడిగా పరిగణిస్తుంది. ఒక బిషప్ అతనికి ఆశ్రయమిచ్చాడు. అయినా పాత అలవాట్లు పోవు. రెండు వెండి ప్లేట్లు, శిలువా దొంగతనం చేస్తాడు. పోలీసులు అతన్ని పట్టుకుని బిషప్ దగ్గరకి తీసుకొచ్చారు. "ఆ వస్తువులు నేనే ఇచ్చాను" అంటూ. " ఈ రెండు వెండి కొవ్వత్తి స్టాండులూ మరచిపోయావేం బాబూ" అని సంచిలో వేస్తాడు బిషప్. అదీ జీన్ వాల్ జీన్‌లో మానసిక పరిణామానికి కారణమయిన మొదటి ఘట్టం.

ఎనిమిదేళ్ళు గడిచాయి. చట్టం ఇచ్చిన గడువును దాటి పరారి అయి - ఒక పట్టణంలో (కావాలనే పేర్లు రాయడంలేదు. ఫ్రెంచి పేర్లు మన ఆలోచనల్ని గజిబిజి చేయకుండా ఉండాలని) పెద్ద ఫాక్టరీ అధిపతి, ఆ నగర మేయరు అయాడు.

అక్కడ పని చేస్తున్న ఓ కూలీ - ఫాంటిన్ అక్రమ సంతానాన్ని కన్నది రహస్యంగా. ఇది తెలిసిన మిగతా వర్కర్లు ఆమెని బర్తరఫ్ చెయ్యాలన్నారు. బిడ్డని పోషించుకోడానికీ, మందులకీ డబ్బులేని ఫాంటిన్ తన మెడలో గొలుసునీ, తన జుత్తునీ తనని తాను అమ్ముకునే వేశ్య అయింది. ఒక విటుడితో తగాదా పడుతున్నప్పుడు - పోలీసు అధికారి జావర్ట్ వచ్చి ఆమెని జైలుకి తీసుకుపోతాడు. జీన్‌వాల్ జీన్ అడ్డుపడి ఆమెను ఆసుపత్రికి చేర్చాలంటాడూ.


కోసెట్

ఒక బండి కింద పడిన మనిషిని జావర్ట్ కళ్ళముందే రక్షిస్తాడు జీన్ వాల్ జీన్. అతని బలాన్ని కళ్ళారా చూసిన జావర్ట్ ఒకనాటి ఖైదీ జీన్ వాల్‌జీన్ (అతని ఖైదీ నంబరు 24601) గుర్తుచేసుకుంటాడు. ఇటీవలే ఆ ఖైదీ దొరికాడంటాడు. తన స్థానంలో ఓ నిరపరాధి అరెస్టుకావడం భరించలేక - తనే ఆ జీన్ వాల్ జీన్‌నని చెపుతాడు.

ఆసుపత్రిలో ఫాంటినకి తన బిడ్డ కోసెట్ ఆలనా పాలనా తను చూసుకుంటానని జీన్ వాల్ జీన్ హామీ ఇస్తాడు. ఫాంటిన్ తృప్తిగా కన్నుమూస్తుంది. జావర్ట్ అతన్ని అరెస్టు చెయ్యడానికి వచ్చేసరికి తప్పించుకుంటాడు.

ఇప్పుడు కోసెట్‌ని చూసుకునే బాధ్యతని థెనార్డియర్స్ అనే దంపతులకు అప్పగిస్తాడు. వాళ్ళు డబ్బు మనుషులు. వీధి చివర కల్లుపాకలాంటి దాన్ని నడుపుకునే మనుషులు వారు. పేదరికంతో వచ్చిన అన్ని కుత్సితాలూ ఉన్నవారు. వారికో కూతురు - ఎపోనైన్. తమ కూతురిని బాగా చూసుకుంటూ కోసెట్‌ని నానా అగచాట్లూ పెడుతూంటారు. (లే మిజరబుల్స్ ప్రతీ ప్రకటనలో ప్రస్ఫుటంగా కనిపించే అందమయిన పేదపిల్ల ఫోటో అప్పటికి కోసెట్‌ది)


థెనార్డియర్స్ దంపతులు, జీన్ వాల్ జీన్, "చిన్ననాటి కోసెట్"తో

జీన్ వాల్ జీన్ వాళ్ళకి కావలసినంత డబ్బిచ్చి కోసెట్‌ని తీసుకుపోతాడు. కోసెట్ పట్ల అతని మమకారాన్ని ఎరిగిన థెనార్డియర్స్ దంపతులు అతని దగ్గర డబ్బునొల్లుకుంటారు.

మరో తొమ్మిది సంవత్సరాలు గడిచాయి. ప్రజాహితాన్ని కోరే పేదల పెన్నిధి అయిన నాయకుడు జనరల్ లామార్క్ చచ్చిపోయాడు. నగరంలో అలజడి లేచింది. దీన్ని అవకాశం చేసుకుని - థెనార్డియర్ దంపతులు - జీన్ వాల్ జీన్ దగ్గర డబ్బురాబట్టవచ్చుననే యావతో ఓ రౌడీ మూకతో జీన్ వాల్ జీన్ మీదా, కోసెట్ మీదా దాడి చేసారు. అతని జీన్ వాల్ జీన్ అని గుర్తుపట్టని పోలీసాఫీసరు జావర్ట్ వాళ్ళిద్దరినీ రౌడీ మూకనుంచీ కాపాడాడు.

ఇప్పుడు మరో పిట్టకథ. వయస్సు కొచ్చిన థెనార్డియర్ కూతురు ఎపొనైన్ - ఓ విద్యార్థి మారియస్‌ని ప్రేమించింది. కానీ మారియస్ కోసెట్ ప్రేమలో పడ్డాడు. ఆమెను వెదికే ప్రయత్నంలో తన ప్రేమని బయట పెట్టకుండా ఎపినైన్ మారియస్‌కి సహకరించింది. పేదల వర్గంలో మరో ఉదాత్తమయిన పాత్ర ఎపొనైన్.

జనరల్ లామార్క్ మరణ వార్త దావానలం లాగ వ్యాపించింది. రాజకీయ స్పృహ కలిగిన యువతరం విప్లవాన్ని రెచ్చగొట్టి రోడ్ల మీదకు వచ్చారు.

కోసెట్ మారియస్ కోసం పరితపిస్తోంది. ఎపొనైన్ తన తండ్రి ముఠా జీన్ వాల్ జీన్ మీద దండెత్తకుండా అడ్డు పడింది. జావర్ట్ తనని అరెస్టు చెయ్యాలని చూస్తున్నాడని అనుమానించి జీన్ వాల్ జీన్ కోసెట్‌తో దేశం వదిలి పోవడానికి సిద్ధపడతాడు.

**రెండో అంకం**

రోడ్డు మీద పెద్ద అడ్డుకట్ట కట్టారు విద్యార్థి బృందం. ఎపొనైన్ కూడా ఈ బృందంలో కలియడం చూసి మారియస్ ఆమె చేతికి ఓ ఉత్తరం ఇచ్చి కోసెట్ దగ్గరకి పంపాడు. ఆ ఉత్తరం జీన్ వాల్ జీన్ చేతుల్లో పడింది. ఎపొనైన్ విద్యార్థి తిరుగుబాటు దళంలో ఉన్న మారియస్ దగ్గరకి బయలుదేరింది.

సైన్యం విద్యార్థి దళాన్ని ఎదిరించింది. దారి తొలగక పోతే చావు తప్పదని హెచ్చరించింది. జావర్ట్‌ని ఈ యువ బృందం పోలీసు వేగుగా పట్టుకున్నారు. యువ బృందాన్ని చేరాలని బయలుదేరిన ఎపొనైన్ సైనికుల కాల్పుల్లో మరణించింది.

మారియస్‌ని వెదుక్కుంటూ జీన్ వాల్ జీన్ ఈ అడ్డుకట్ట దగ్గరకి వచ్చాడు. యువబృందం జావర్ట్‌ని చంపే పనిని జీన్ వాల్ జీన్‌కి


జీన్ వాల్ జీన్ నాటకం పూర్తయేసరికి 75 ఏళ్ళ వయస్కుడుగా [illegible] మేకప్‌లో

అప్పగించారు. కానీ జీన్ వాల్ జీన్ అతన్ని చంపకుండానే విడిచిపెట్టాడు. ఆ రాత్రికి విశ్రమించారు యువత. మారియస్ ప్రాణాలు కాపాడమని భగవంతుడిని ప్రార్థించాడు జీన్. కానీ మరునాడే తిరుగుబాటుదారులందరినీ సైన్యం కాల్చివేసింది.


జీన్ వాల్ జీన్

తీవ్రంగా గాయపడిన మారియస్‌ని తీసుకుని భూగర్భంలోని మురికినీటిని సొరంగం గుండా తప్పించుకున్నాడు జీన్‌వాల్ జీన్. ఇప్పుడు మళ్ళీ జావర్ట్ చేతుల్లో చిక్కాడు. చేతిలో స్పృహ తప్పివున్న కుర్రాడిని ఆస్పత్రికి చేర్చి వస్తానని బతిమాలాడు జీన్ వాల్ జీన్. అతని చేతుల్లో ప్రాణదానం పొందిన జావర్ట్ కనికరించి వదిలాడు. కాని జీన్ వాల్ జీన్ నీతి, మొక్కవోని నిజాయితీ, కరుణ వీటి ముందు తనెంత! తన బ్రతుకెంత! పశ్చాత్తాపంతో కృంగిపోయాడు. ఆ దైన్యతలోనే నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

మారియస్ తేరుకున్నాడు. జీన్ వాల్ జీన్ తన అసలు కథ అతనికి చెప్పాడు. మారియస్ కోసెట్‌ల పెళ్ళి జరిగింది. ఇద్దరూ జీన్ వాల్ జీన్ దగ్గరకి వచ్చారు. ఇప్పుడు డెబ్బయ్యో పడిలో ఉన్నాడు జీన్ వాల్ జీన్. ఆమె కథని మొదటిసారిగా వివరించి చెప్పి, ఇద్దరినీ ఆశీర్వదించి కన్నుమూశాడు.

పేదల బ్రతుకుల్నీ, వారి జీవితాల్లో ఆర్ద్రతనీ, ప్రేమనీ, త్యాగాన్నీ, దయనీయతనీ ఎంతో హృద్యంగా ఆద్యంతమూ హృదయం ద్రవించేలాగ చిత్రించిన కళాఖండం 'లే మిజరబుల్స్', ఆఖరికి చట్టానికి ప్రాతినిధ్యం వహించే జావర్ట్ పాత్రని కూడా మానవతా

దృక్పథంతో ముగించాడు రచయిత. 60 - 70 సంవత్సరాల సుదీర్ఘమైన ఈ చరిత్ర - ఓ గొప్ప ఇతిహాసం. నవల చదివి కిందపెట్టాక కూడా ఆయా పాత్రలు ఆలోచనల్లో వెంటాడుతాయి. ఎపొనైన్ మరణం, కోసెట్ పసితనం ఆమె తల్లి దైన్యత, చివరలో జీన్ వాల్ జీన్ వృద్ధాప్యం - ఇవన్నీ హృదయాన్ని ద్రవింపజేసే కరుణాత్మకమయిన ఘట్టాలు.

ఇంత విస్తృతమయిన కథని - ఇన్ని దశాబ్దాలు నడిచే కథని - ఇన్ని రకాలయిన సన్నివేశాలతో - కొన్ని పాత్రల వయస్సులో మార్పులన్నీ స్ఫురింపజేస్తూ ఎక్కడా వ్యవధి ఇవ్వకుండా ప్రదర్శించడం అనూహ్యమయిన విషయం. చాలా వాటికి పెద్ద సమాధానం రివాల్వింగ్ స్టేజి. తిరిగే స్టేజిమీద పదడుగులు వెనక్కి పరుగుతీస్తే మాయమయే లైటింగు. ఆ కాలపు దుస్తులూ, మేకప్పులూ - ఇది అద్భుతమయిన పనివాడితనం. ముఖ్యంగా జీన్ వాల్ జీన్, జావర్ట్, థెనార్డియర్స్ దంపతుల మేకప్‌లలో దశాబ్దాల మార్పులు రావాలి. అదిన్నీ క్షణాల మీద జరగాలి. పాతికేళ్ళ వయస్సులో కనిపించిన జీన్ వాల్ జీన్ నాటకం పూర్తయేసరికి 75 ఏళ్ళ వయస్కుడు. ఈ మార్పుల్ని అద్భుతంగా ఆహార్యంతో పాటు మార్పులను ఆశ్చర్య చకితుల్ని చేసే విధంగా చూపారు.

స్టేజీ మీద దాదాపు 70 మంది నటీనటులుంటారు. స్టేజి వెనకా అంతమంది (అండర్ స్టడీస్ లెక్కపెట్టకుండా) ప్రతీ రోజూ పనిచెయ్యాలి. సంగీత వాద్యాలు ప్రతి ప్రదర్శనకీ మ్రోగాల్సిందే. ఈ హంగులతో మొదలెట్టినప్పటినుంచీ 3 గంటలు సాగే నాటకం - 21 సంవత్సరాలుగా ఇంగ్లండులో - ఇలాగే మరో 38 దేశాలలో ప్రతిరోజూ సాగుతోంది! ఇదో గొప్ప ఉద్యమం.

ఇంతకంటే ప్రదర్శన గురించి ఏం చెప్పినా చెప్పడమే అవుతుంది. చూసిన అనుభూతిని ఏ కాస్తా పంచడం అవదు.

దీని సృష్టికర్తలు - అరెన్ బౌబ్లిల్ అనే గీత రచయిత, క్లాడ్ మైకేల్ షోన్ బర్గ్ అనే సంగీత కర్త. ఇద్దరూ ఫ్రెంచి దేశస్తులు. 1972లో అమెరికాలో బ్రాడ్వేలో 'జీసస్ క్రైస్ట్ సూపర్ స్టార్" సంగీత రూపకాన్ని చూస్తుంటే - ఇలాంటి రచన ఎందుకు చెయ్యకూడదనే ఆలోచన వచ్చింది ఇద్దరికీ. 1980లో ఆ ఆలోచన కార్యరూపం దాల్చింది. అయితే 1983 లో కామెరాన్ మెకింతోష్ అనే ఇంగ్లీషు నాటక నిర్మాత దీనిని అధిగమించి - పాలస్ థియేటరులో నిరాఘాటంగా 18 సంవత్సరాలు నడిచి ప్రస్తుతం క్వీన్స్ ధియేటరులో రాజ్యం ఏలుతోంది ఈ నాటకం.


కామెరాన్ మెకింతోష్

అసలు ఈ కామెరాన్ మెకింతోష్ఎవరు?35 సంవత్సరాల క్రితం అభిరుచి, దక్షత ఆత్మస్థైర్యం అన్నీ కలబోసిమొదటి సంగీత నాటకాన్ని నిర్మించాడు. ఇప్పటికి రికార్డులు బద్దలు చేసిన దికాట్స్. లే మిజరబుల్స్ ది ఫాంటమ్ ఆఫ్ ది ఆపెరా సంగీత నాటకాల్ని నిర్మించాడు. ఆయన నిర్మించిన 'మిస్ సైగాన్'ని నేను లండన్‌లో చూసి పులకించిపోయాను. అదొక అద్భుతమయిన కళాఖండం. లండన్ వెస్టెండ్‌లో ఈయనకి ఏడు థియేటర్లున్నాయి. 1996 లో బ్రిటన్ రాణి ఈయన నాటక రంగానికి చేసిన సేవలకు "సర్" బిరుదునిచ్చి సత్కరించింది. ఇంకా రకరకాల గౌరవాలు ఈయనకు దక్కాయి. తీరా ఈయన వయస్సు 55 దాటదు. వ్యాపారాన్నీ కళనీ మేళవించి ఓ 30 సంవత్సరాలపాటు ప్రపంచ ప్రేక్షకులకు ప్రతి దినం ఆనందాన్ని పంచిన గారడీవాడు మెకింతోష్.

ఈయన మాటల్లోనే 21 సంవత్సరాల కిందట ఈ నాటకం తొలి ప్రదర్శన అనుభవాలను విందాం. 1985 అక్టోబరు 8 న బార్బికన్ థియేటర్‌లో 'లే మిజరబుల్స్' తొలి ప్రదర్శన జరిగింది. "అంతకు ముందు విమర్శకులూ, ముందు ప్రీవ్యూలు చూసిన వారూ ఈ నాటకాన్ని ఆకాశానికి ఎత్తేశారు. ఆ ఉత్సాహంతో తొలి రోజున పేపర్లు ఏం రాసాయో చూద్దామని ఫ్లీట్ స్ట్రీట్‌కి పరిగెత్తాను. వాళ్ళు చేసిన విమర్శలు చదవగానే గుండె జారిపోయింది. కొందరు సమర్థించడానికి ప్రయత్నించారు. మధ్యాహ్నానికి - దుర్వార్తకి సిద్ధమవుతూనే - బాక్సాఫీసు వివరాలు కనుక్కోవాలని, ఈ విమర్శలు కారణంగా ప్రేక్షకులు ఎంత దూరమయారో, టిక్కెట్లు ఎలా అమ్ముడుపోయాయో తెలుసుకుందామని బయలుదేరాను. నన్ను చూస్తూనే బాక్సాఫీసు మేనేజరు పరిగెత్తుకు వచ్చాడు. "అసలు ఇక్కడికి మనుషుల్ని తప్పించుకు

ఎలా రాగలిగారా"ని ఆశ్చర్యపోయాడు. ఆ ఉదయం కేవలం 500 టిక్కెట్లు అమ్ముడుపోయాయట! నేను కొయ్యబారిపోయాను.

ప్రజలు మేధావుల విమర్శలకి తమ మనస్సులతో సమాధానం చెప్పారు. పత్రికలు సహకరించకపోయినా, ప్రచారం కలిసిరాకపోయినా మామూలు ప్రేక్షకుడు థియేటరుకి వచ్చాడు. ప్రేక్షకుల నోటి ప్రచారానికి, ఏ ఆంక్షలూ లేని వారి అభిమానానికి ఎల్లలు లేవని ఆ రోజే గ్రహించాను. అప్పటి నుంచీ వేలాది ప్రొడక్షన్స్ ప్రపంచమంతా సాగాయి. పాలస్ థియేటర్‌కి ఈ ప్రదర్శన బదిలీ అయినప్పుడు 18 సంవత్సరాలు నడుస్తుందని ఊహించలేదు. జులై 2005 బిబిసి రేడియో 2 జరిపిన పోలింగులో 50 శాతం శ్రోతలు 'లే మిజరబుల్స్' ఈ దేశపు అభిమాన సంగీత రూపకంగా పేర్కొన్నారు.




2002 విక్టర్ హ్యూగో 200 జయంతి సందర్భంగా - 19 సంవత్సరాలలోపు పిల్లల చేత ఈ నాటకం చేయించారు. మొదటి నాలుగు సంవత్సరాలలో 76 వేల మంది పిల్లలు 1500 ప్రదర్శనలు జరిపారు. ఒక్కసారి జీవితంలో వెనక్కి తిరిగి చూసుకుంటే - 'లే మిజరబుల్స్'ని వేదిక ఎక్కించడం నా జీవితంలో గర్వించతగ్గ విజయంగా భావిస్తాను."

ఒక్కసారి విజయలక్ష్మి వరిస్తే - ఇక దానికి హద్దూ పద్దూ ఉండదు. ఈ సంగీత నాటకం డివీడి రికార్డింగు 20 పౌన్లకి మార్కెట్లో దొరుకుతుంది (అడ్రసు" ది కాస్ట్ కలెక్షన్, 3 వారెన్ మ్యూస్, లండన్ W1 T 6AN). ఇక వేలం వెర్రికి అంతం లేదు. లే మిజరబుల్స్ తాళం గుత్తి, పోస్టర్లు, పైట పిన్నులు, మగ్గులూ, బేస్ బాల్ టోపీలూ, పియానోలూ, పెన్నులూ, టీ షర్టులూ - మీ ఇష్టం ఏదయినా ఖరీదుకి దొరుకుతాయి. వెర్రినీ, విజయాన్నీ డబ్బు చేసుకోవడం బ్రిటిష్ వారికీ - అంతకంటే అమెరికన్లకీ తెలిసినట్టు మరెవరికీ తెలియదు.

అయితే ఒక నాటకానికి ఇలాంటి ప్రాచుర్యం - 2007 లో ఎక్కడయినా దక్కుతోందంటే - నాటకాభిమానిగా నా మనస్సు ఉప్పొంగిపోతుంది.

ఏనాడయినా మనదేశంలో మృచ్ఛకటికంనీ, వాసవదత్తనీ, అభిజ్ఞాన శాకుంతలాన్నీ, రాగరాగిణీనీ, కీర్తిశేషులునీ - ఇలా చూడగలమా?

✷✷✷

# ఆంటోనీ అండ్ క్లియోపాత్రా

**సరిగ్గా 400 సంవత్సరాల** క్రిందట షేక్స్పియర్ వ్రాసిన నాటకం ఆంటోనీ అండ్ క్లియొపాత్రా. (రచనా కాలం:1606) భాషని అద్భుతంగా విన్యాసాలు చేయించిన మహా రచయితలెందరో ఉన్నారు. పి.జి.వోడ్ హౌస్, క్రిస్టొఫర్ ఫ్రై, స్టీఫెన్ లీకాక్, మార్క్‌ట్వెయిన్ - ఇలాగ. కాని భాషకి అంత క్లుప్తమైన మాటల్లో సముద్రమంత లోతునీ, కత్తి అంత పదునునీ ఇచ్చిన మహాకవి - షేక్స్పియర్ దగ్గరగా వచ్చే రచయితయినా లేడు. అందుకనే శతాబ్దాల తర్వాత కూడా భాషాభిమానులు, నాటకాభిమానులు ప్రత్యేకంగా షేక్స్పియర్ అభిమానులూ ఈ నాటకాల్ని చూస్తూనే వున్నారు - ఇంకా ఇంకా.

ఒకనాటి మధ్యాహ్నం రెండున్నరకి నోవెల్లో థియేటర్‌లో 3 గంటల ప్రదర్శన. బయట ఒక డిగ్రీ చలి. అయినా - చివరి క్షణం వరకూ బాక్సాఫీసు దగ్గర క్యూ ఉంది. ఆ ప్రదర్శనకి హాలు కిటకిటలాడింది. ఆ-నందంతో, ఆవేశంతో నాకళ్ళు చెమర్చాయి. 400 సంవత్సరాల కింద రచయిత రాసిన కింద రచయిత రాసిన నాటకానికి ఎంత గొప్ప నివాళి!




**నాటకాన్ని గురించి**

ఫ్రెంచి ఫిలాసఫర్ బ్లెయిస్ పాస్కల్ ఒక మాట అన్నాడు "క్లియోపాత్రా ముక్కు కాస్త పొట్టిగా ఉంటే ప్రపంచ చరిత్ర మరో విధంగా ఉండేద"ని. అయితే ఆ కాలంలో దొరికిన నాణాలను బట్టి క్లియోపాత్రా ముక్కు అంత పొడుగయిందేం కాదు. కాని ఆమె అందం, తెలివితేటలు, చాకచక్యం, వలుపుకులుకులూ - మీ ఇష్టం - అన్నీ కలిపితే అలనాటి రోమన్ చరిత్రను మార్చిన క్లియోపాత్రా అవుతుంది. ఆమె మరులు, వగలు, తన అందంతో ఆనాటి రాజకీయాలతో పాచిక లాడిన ఆమె మేధస్సు వర్ణనాతీతం. ఇవన్నీ ప్రతిఫలించేలాగ ఈ చిత్రం కనిపిస్తుంది. చిత్రకారుడు పాత్రని తన కుంచెతో చెప్పక చెప్పిన చిత్రమిది.


ఆంటోని క్లియోపాత్రా


క్లియోపాత్రా పెయింటింగ్

అప్పటి ఈజిప్టు, అలెగ్జాండ్రియా కథ చెప్పాలంటే - పెద్ద కాశీమజిలీ కథ అవుతుంది. ఒకనాడు మకుటం గల మహారాజుగా వెలిగిన జూలియస్ సీజర్ అలెగ్జాండ్రియా వచ్చినప్పుడు - 21 సంవత్సరాల రాణీ క్లియొపాత్రా తనని తాను నగ్నంగా ఒక తివాచీలో చుట్టించుకుని సీజర్ పాదాల ముందుకు దొర్లింది. అతనితో పొందుతో గర్భవతి అయింది. ఈజిప్టు సింహాసనానికి తనతో పోటీపడగలిగే సోదరుడి చావుకి

కారణమయింది. ఆమె ఈజిప్టుకి రాణి అయింది. ఆమెని పెళ్ళి చేసుకుని ప్రపంచానికే సామ్రాజ్ఞిని చేయాలనుకున్న సీజర్ కోరిక తీరకుండానే అతను హత్య చేయబడ్డాడు. క్లియోపాత్రా తనకి ఇంక రోమ్‌లో పాత్ర లేదని తన స్థానానికి జారుకుంది.

దరిమలాను రోమ్ ముగ్గురు సంయుక్త పాలనలోకి వచ్చింది. మార్క్ ఆంటోని, సీజర్ హత్యవరకూ ఆయన అనుయాయిగా ఉన్న మార్కస్ లీపిడస్, సీజర్ మేనల్లుడు, తన వారసుడని సీజరే ఎంపిక చేసిన ఆక్టేవియస్ (అతని వయస్సు అప్పటికి 20 ఏళ్ళు). మార్క్ ఆంటోని విలాస పురుషుడు, కాస్త ముదురు ప్రేమకి మొగ్గు చూపే వ్యక్తి.

క్లియోపాత్ర అతని బలహీనతలను కనిపెట్టి, రోమ్‌కి దగ్గరవాలంటే ఆంటోనీయే దగ్గర త్రోవని గుర్తించి - అతన్ని ఆకర్షించే అద్భుతమయిన అట్టహాసంతో అతని ముందుకు వచ్చింది. ఆమె ఊహించినట్టే ఆంటోని క్లియోపాత్రాకి దాసుడయి అలెగ్జాండ్రియాలో సరస సల్లాపాలలో మునిగి తేలుతున్నాడు. క్లియోపాత్ర మళ్ళీ గర్భవతి అయింది. సీజర్‌తో కొడుకుని కని, ఇప్పటి రోమ్ అధినేతల్లో ఒకరికి కవల పిల్లల్ని కన్నది. వీళ్ళ ప్రేమ వ్యవహారం నలుగురి నోళ్ళలో పడుతున్న సమయంలో - ఇక్కడే - షేక్స్పియర్ నాటకం ప్రారంభమయింది.

ఈ రోజుల్లో బ్రతికి ఉంటే షేక్స్పియర్ మీద బ్రిటిష్ రచయిత ప్లూటార్క్ గ్రంధ చౌర్యం దావా వేసేవాడు. విశేషం ఏమిటంటే తప్పక కేసు గెలిచేవాడు కూడా. ఆయన వ్రాసిన "మార్క్ ఆంటోనీ జీవితం"లో ఆంటోనీ, పాత్రకి షేక్స్ఫియర్ నాటకంలో ఆంటోని పాత్ర మక్కీకి మక్కీగా కనిపిస్తుంది. ఇక ప్లూటార్కే చరిత్రని రెండు పరస్పర విరుద్ధమయిన కోణాల్లో దర్శించి ఉటంకించాడు.

క్లియోపాత్రా చచ్చిపోయిన 200 సంవత్సరాల తర్వాత ఆమె డాక్టర్ జ్ఞాపకాలు ఒక పక్షం. రోమన్ చరిత్ర మరొక పక్షం. డాక్టర్ కథ ప్రకారం క్లియోపాత్రా మంచి పండితురాలు, గొప్ప పాలకురాలు. ప్రజలను కన్నతల్లిలాగ పాలించింది. గ్రీకుల ఆరాధ్యదేవత ఐసిస్ అవతారంగా అభివర్ణించాడు. ప్రభువుల గురించి ఒక మామూలు రచయిత అంతకన్న ఏం రాస్తాడు? కాని రోమన్ కథ ప్రకారం (వీరు పరాయి పాలకులు!) క్లియో పాత్రా కోరికలని రెచ్చగొట్టే అందకత్తె. అవసరానికి మదాన్ని ఫణంగా పెట్టే అవకాశవాది. ఎంతసేపూ విందులూ, వినోదాలతో కాలం వెళ్ళబుచ్చే రాణి. ఒక రోమన్ హీరోను వలలో వేసుకుని తన స్థాయికి దిగజార్చిన 'చింతామణి!'

ఈ రెండూ ధోరణుల్నీ ప్లూటార్క్ కలబోశాడు. షేక్స్పియర్ ఆ రుచిని అందుకున్నాడు.

ఇప్పుడు షేక్స్పియర్ కథ. ఆంటోనీ ఈజిప్టు రాణితో విలాస జీవనం గడుపుతున్నాడు. రోమ్‌లో ఫ్లూవియా అనే తన భార్యని విస్మరించాడు. అతని సహచరుడు ఆక్టేవియస్ సీజర్ అతన్ని వెనక్కి రమ్మన్నాడు. ఆంటోనీ రాలేదు. చివరికి పాంపే మీద దాడి చేస్తానన్న బెదిరింపుకి లొంగి వచ్చాడు. అప్పటికి ఫ్లూవియా కన్నుమూసింది.

తన సహచరుని చెల్లెలు ఆక్టేవియాను పెళ్ళిచేసుకుని - మిత్రుడితో రాజీ పడ్డాడు ఆంటోనీ. ఏమయినా క్లియోపాత్రా మీద మోహం మళ్ళీ అటులాగింది. ఈ భార్యనీ వదిలి ఈజిప్టు వెళ్ళిపోయాడు. ఆగ్రహంతో ఆక్టేవియస్ ఈజిప్టుపై దండెత్తాడు. ఆ యుద్ధంలో - అనుచరుల, క్లియోపాత్రా హితవుని కాదని తనకి లాయకీ లేని సముద్రం మీద యుద్ధానికి దిగి ఆంటోనీ ఓడిపోయాడు. రాజీకి ఆక్టేవియస్ అంగీకరించలేదు. రెండో యుద్ధంలో ఈజిప్టు సైన్యాలు వెనుదిరిగాయి. అవమానంతో తన ప్రేయసిని (క్లియోపాత్రాని) చంపుతానని బెదిరించాడు ఆంటోనీ.

క్లియోపాత్రా రహస్య స్థలానికి పోయి - తను చచ్చిపోయినట్టు తన అనుచరుల చేత ప్రకటన చేయించింది. ఒక పక్క యుద్ధంలో పరాజయం, మరొక పక్క ప్రియురాలి మరణంతో గుండె చెదిరి ఆంటోనీ తన స్నేహితుడి కత్తి మీద పడి ఆత్మహత్యకి తలపడ్డాడు. ఇప్పుడు క్లియోపాత్రా అనుచరులు తీవ్రంగా గాయపడిన ఆంటోనీని రాణి దగ్గరకి తీసుకొచ్చారు. తన ప్రేమని వ్యక్తం చేస్తూ క్లియోపాత్రా చేతుల్లో ఆంటోనీ కన్నుమూశాడు.

అక్టేవియస్ మిత్రుడి మరణానికి చింతించాడు. క్లియోపాత్రా ఓటమికి చిహ్నంగా ఆమెని పెద్ద అట్టహాసంతో (అలనాడు ఆంటోనీ దగ్గరకి వచ్చినట్టు) తన రాజధానికి తరలి రమ్మన్నాడు. సీజర్ (అక్టేవియస్) చేతుల్లో తన జీవితం మరింత దుర్భరమవుతుందని భయపడి ప్రియుడి మరణానికి కృంగిపోయిన క్లియోపాత్రా తన అనుచరుల సమక్షంలో - సమస్త అలంకరణలతో మహారాజ్ఞిగా అలంకరించుకుని - పాముచేత కరిపించుకుని కన్నుమూసింది.

చరిత్రనీ, యుద్ధాన్నీ, ఆవేశాన్నీ, ప్రేమనీ, ఈర్ష్యనీ, ద్వేషాన్నీ - ఇన్నిటిని మేళవించిన సమగ్రమయిన సృష్టాన్నం ఈ నాటకం. ఈ తరంలో ఇలాంటి నాటకాలను మనం ఊహించలేం. ఈ నాలుగు శతాబ్దాలలో ఎందరో మేధావులు, ఎన్నో రకాలయిన ఆలోచనా పరంపరలతో - షేక్స్పియర్ నాటకాలను ఎన్నో విధాలుగా ప్రదర్శించారు. ఎవరి మేధస్సు ఎలా రూపం కల్పిస్తే - ఒక మహారచయిత 'సృష్టి' అంత సంపన్నంగా రంగస్థలం మీద ఆవిష్కృతమైంది.

క్లియోపాత్రా పడకగది, ఆమె సభ తీర్చిన సభా భవనం, ఆంటోనీ అక్టేవియస్‌ల కలియక, యుద్ధ ప్రాంగణం, చివరలో క్లియోపాత్రా ఆత్మహత్య చేసుకున్న మందిరం - ఇలా ఎన్నో సనివేశాలు కేవలం స్పాట్ లైట్ల వెలుగు నీడల్లో యాక్టింగ్ స్పేస్ ని సృష్టిస్తూ చూపుకు పోయారు. త్యాగరాజస్వామి మాటల్లో గోవు వెంట వత్సములాగే ఆ చూపు అనుసరిస్తూ ప్రేక్షకులూ సాగిపోయారు.

నాకు ఇప్పటికీ అర్థంకాని విషయం ఒకటుంది. "నీ వినీల కచ భారంపై బహుళ పంచమి జ్యోత్స్న శీతల స్పర్శ నా హృదయ వాటాన్ని మేలుకొలుపుతోంది తన మెత్తని వేళ్ళతో. ఓ బంధకీ! నా కన్నులను శపించకు" - ఇలాంటి సంభాషణలను - ఉద్విగ్నంగా, ఆవేశపూరితంగా, ఆంగికాభినయంతో మేళవించి 2007 నాటి ప్రేక్షకులకి ఎలా సంధించారో అర్థంకాదు. సంభాషణలలో కవిత్వం, అలంకార గరిమ, కాస్త నారికేళ పాకంలో సాగే తీరూ మధ్య మధ్య తెలుస్తూంటుంది. ఈ ధోరణి పాత్రల బరువునీ, ఆలోచనా సాంద్రతనీ పెంచే మాట నిజమే. ఆ మేరకు నాటకం నడక మందమవుతుంది. షేక్స్పియర్ నాటకాలలో పరిచారకుడు, మామూలు పాత్రా షేక్స్పియర్ అంత అద్భుతంగా, తెలివిగా మాట్లాడుతారు. ఇది classical stylization. మరి పాత్రీకరణలో తేడాలు ఎలా ప్రతిఫలిస్తున్నారు? షేక్స్పియర్ నాటకం చదవాలంటేనే 3 గంటలు పైన పడుతుంది. మరి అర్థాన్ని అందుకుంటూ, అనుభూతిని పంచుకుంటూ మూడు గంటల్లో నాటకం చూడాలంటే! ఇదే బ్రిటిష్ నాటక రంగం మేజిక్కు. దీనికి సమాధానం కావాలంటే ఒక్కసారి మీరు వెస్టెండు నాటకశాలలో కూర్చోవాలి. అయితే కళ్ళుమూసుకుని ఒక్కసారి ఆనాటి ప్రదర్శనని ఊహించుకుని షేక్స్పియర్ నాటకం పుస్తకాన్ని తెరిస్తే ఇప్పటికీ నా దిగ్భ్రమ తీరదు.




ఉదాహరణకి: ఒకచోట క్లియోపాత్రా అంటుంది:

"Oh, my oblivion is a very Antony"

విషాదమూ, నిర్వేదమూ నిండుకున్న ఈ ఆలోచనని మనస్సులో మననం చేసుకోవడానికి నాకయితే గంట పడుతుంది. ఈ ఆలోచనని ఏ భాషలోనూ అనువదించడానికి సాధ్యం కాదని షేక్స్పియర్ పండితులు చేతులెత్తేశారు. అయినా ఒకాయన వివరణ ఇస్తూ - అలా వివరణ ఇచ్చినందుకే సిగ్గుపడిపోయాడు "even when I forget every thing I remember nothing but Antony, though he forgets me". ఈ అన్వయం భగవంతుడిని ఉపనిషత్తులలో దర్శించడానికి చేసే ప్రయత్నం లాంటిది. గొప్ప ఆలోచన ఆయా వ్యక్తుల మేధస్సుని బట్టి వికసిస్తుంది

క్లియో పాత్రా ఆత్మహత్యకు సన్నద్ధమయి - పాముని సిద్ధం చేయించుకుని - అలంకరణ చేసుకుంటూ ఒక మాట అంటుంది.

The stroke of death as a lover's pinch

Which hurts, and is desired.

ఈ ఆలోచనని ఏకాంతంలో చదువుకు ఆనందించడం ఒక ఎత్తు. నాకేమోప్రదర్శించిన నాటకాన్ని ఏమయినా సంస్కరించుకుంటున్నారా? తెలుసుకోవాలనుంటుంది. వారి రిహార్సిల్స్ చూడాలని ఉంటుంది. (ఆంటోనీ అండ్ క్లియోపాత్రా రిహార్సిల్స్ ఫొటోని చూడవచ్చు)

ఏమయినా - 400 సంవత్సరాల కిందటి నాటకాన్ని ఈనాటి ప్రేక్షకుడు చూసే స్థాయికి అలంకరించడం అద్భుతమయిన కృషి నేను చెప్పడానికి అలిసిపోని విషయమొకటుంది. ఈ నాటకం ప్రదర్శించినది రాయల్ షేక్స్పియర్ కంపెనీ. ఈ కంపెనీ ప్రధాన పోషకురాలు ఎలిజబెత్ రాణీ. అధ్యక్షులు వేల్స్ యువరాజు. ఇంకా బెన్‌కింగ్స్లీ (ఈపేరు మనకు తెలుసు కనుక వ్రాస్తున్నాను), పాట్రిక్ స్టూవర్ట్, క్రిస్టాఫర్ మార్లే - వంటి 163 సభ్యులున్న బృహత్తరమయిన కంపెనీ.

ఈ సంవత్సరం షేక్స్పియర్ నాటకాలన్నీ తయారు చేసి ప్రదర్శించాలనే (ఇలా ఎన్నవసారో!) ప్రణాళికలో భాగంగా ఈ సీజన్‌లో రాయల్ షేక్స్పియర్ కంపెనీ మూడు నాటకాలను సిద్ధం చేసింది. మచ్ ఎడో ఎబౌట్ నథింగ్, ఆంటోనీ అండ్ క్లియోపాత్రా, టెంపెస్ట్. మిగతా నాటకాలూ వరుసగా ప్రదర్శిస్తారు. ఈ సీజన్‌లో ఈ మూడు నాటకాల ప్రదర్శన వివరాలు చెప్పే పాంప్లెట్ చూస్తేనే ఒళ్ళు పులకరిస్తుంది. వేసేవారి సామర్థ్యం ఒక కారణమైతే చూసే వారి ఆదరణ మరొక కారణం.

రాయల్ షేక్స్పియర్ కంపెనీ కేవలం నాటకాలు వేసి డబ్బు సంపాదించే వ్యాపార సంస్థకాదు. అదొక గొప్ప ఉద్యమం. అనూహ్యమైన ఉద్యమం. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రణాళికలున్నాయి. మీ అబ్బాయికి షేక్స్పియర్ నాటకాల్ని కథలుగా చెప్పించే తర్ఫీదు ఇవ్వాలనుకుంటున్నారా? ఒక్క పౌను ఖరీదుతో ఐదేళ్ళలోపు పిల్లలకి కార్యక్రమం వుంది. నాటకం అయాక చర్చలు - ప్రదర్శన బృందాలతో ప్రసంగ కార్యక్రమాలునాయి. నాటకం చూశాక మీ ప్రశ్నలు ఏమయినా ఉన్నాయా? సమాధానాల కార్యక్రమం ఉంది. పదహారేళ్ళు దాటిన పిల్లలకి నటులతో - థియేటర్ గురించీ, ఇంగ్లీష్ నాటకాల గురించీ చర్చా కార్యక్రమాలున్నాయి. కొన్ని రోజులలో డైరెక్టరుతో ఇంటర్వ్యూలున్నాయి. 9 - 13 వయస్సులో పిల్లలు నటులు, ప్రదర్శకుల్ని కలిసే 'ఫామిలీ డేస్' కార్యక్రమం ఉంది. షేక్స్పియర్ గురించి వివరణ, అన్వయాని బోధించే సమావేశాలున్నాయి. స్కూళ్ళలో చదువుకునే పిల్లలక్ వర్క్ షాప్‌లున్నాయి. వాళ్ళకి చదువులు చెప్పే టీచర్లకి వేరే కోర్స్‌లున్నాయి. నటులు తమ నటనా కౌశలాన్ని పెంచుకునేందుకు అభివృద్ధి ప్రణాళికలున్నాయి. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రాయల్ షేక్స్పియర్ కంపెనీ కార్యకలాపాలను పరిచయం చేసే ప్రోగ్రాంలున్నాయి.

దీనిని బట్టి - ఇంగ్లండులో ప్రతీ దినం ఇన్ని వందల మంది నాటకాలు ఎందుకు చూస్తున్నారో తమకు అర్థమయివుటుంది. మూడేళ్ళ వయసునుంచీ ఉగ్గుపాలతో పిల్లలకి నూరిపోసిన అలవాటు ముదిరి తలకెక్కి నాటకం చూడడం జాతి వ్యసనంగా, దైనందిన చర్యగా స్థిరపడుతుంది.

కాన్వెంటులు మరిగిన - ఇంగ్లీషు నేర్పడం అభివృద్ధిగా భావించే నేటి కుహనా అభ్యుదయ వాదులు - తల్లితండ్రులు - ఇప్పటికయినా పెద్ద బాలశిక్షని మూడేళ్ళ కుర్రాడి చేతికి ఇవ్వడం ద్వారా రాబోయే తరానికి తెలుగు మీద అభిమానాన్ని పునరుద్ధరించగలమని చెప్పడానికి ఇదొక అద్భుతమయిన ఉదాహరణ. ముసలాళ్ళకీ, ప్రవాసాంధ్రులకీ తెలుగు పాఠాలు నేర్పడం - మనం అభివృద్ధి అని చంకలు గుద్దుకోవడంలాంటిదే వేరులో పురుగుని వదిలేసి పువ్వుకి కొత్త రంగు పూలమాలని తలబద్దలు కొట్టుకోవడంలాంటి వృథా పరిశ్రమ అది.

మళ్ళీ ఈ నాటకం దగ్గరికి వస్తే - ఆంటోనీ పాత్రని బ్రిటిష్ నాటక రంగంపై పేరు ప్రఖ్యాతులు సాధించిన పాట్రిక్ స్టూవర్ట్ అనే నటుడు ధరించాడు. ఈ సీజన్‌లో ఈయన టెంపెస్టులో ప్రోస్పెరో పాత్రనీ ధరిస్తున్నాడు. ఇక క్లియోపాత్రా మరో ప్రముఖనటి హారియట్ వాల్టర్ చేసింది.




ప్రస్తుత ప్రదర్శన మీద రెండే రెండు పత్రికల ప్రశంసలను పేర్కొటాను:

"Burning with passion an intelligence, aims straight at the heart and hits it" – Daily Telegraph.

“An absolutely storming antony and Cleopatra” – Sundaya Times.

ఇక స్థూలంగా నొవెల్లో థియేటర్ గురించి రెండు మాటలు. కామెరాన్ మెకింతోష్ అనే థియేటర్ యజమానికి (ఈయన నాటకాల ప్రొడ్యూసరు కూడా) వెస్టెండులో ఏడు థియేటర్లున్నాయి. ఆయన రాయల్ షేక్స్పియర్ కంపెనీతో ఏర్పరచుకున ఒప్పందం ప్రకారం - ఈ సంవత్సరం పొడుగునా షేక్స్పియర్ నాటకాలు నోవెల్లో థియేటర్లో ప్రదర్శిస్తారు.

1905లో షూబర్ట్ అనే న్యూయార్క్ వ్యాపారి ఈ థియేటర్ని అద్దెకి తీసుకున్నాడు. అప్పుడు ఈ థియేటరు పెరు వాల్డోర్ఫ్. అప్పటి ఆయన పార్ట్నర్స్ - శామ్, జె.జె. వారికి ఆ రోజుల్లో అమెరికాలో 20 థియేటర్లు ఉండేవి. తీరా ఈ థియేటర్ని తీసుకుని




ప్రదర్శనని ప్రారంభించడం శామ్ తన జీవితంలో చూడలేకపోయాడు. కారణం - ప్రదర్శనకు తొమ్మిది రోజులు ముందు ఓ రైలు ఆక్సిడెంటులో కన్నుమూశాడు. ఈ సోదరుల స్మృతి చిహ్నంగా- ఈ థియేటర్లో డ్రెస్ సర్కిల్ (పెద్ద టిక్కెట్టు) పక్క నున్న బార్కి షూబర్ట్ బార్ అనీ, మెట్ల పక్కనున్న బార్కి శామ్స్ బార్ అని పేరు పెట్టారు.

మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో - 1915 అక్టోబరు పదమూడున ఈ థియేటరు ముందు (జెప్లిన్ దాడిలో) 19 బాంబులు పడ్డాయట. ఆ రోజు లోపల జరుగుతున్న నాటక పేరు "ది స్కార్లెట్ పింపర్నల్". ఫ్రెడ్ టెర్రీ పింపర్నల్గా నటిస్తున్నాడు. బయట భీభత్సాన్ని మరిపించే విధంగా ఆనాటి ప్రదర్శనని దిగ్విజయంగా నడిపించారట ఫ్రెడ్ టెర్రీ.

అప్పుడు ఈ థియేటరు పేరు స్ట్రాండ్ 1917లో మొట్టమొదటిసారిగా అమెరికన్ రచయిత యూజినీ ఓనీల్ నాటకం 'అన్నా క్రిస్టీ'ని ఈ థియేటరులో ప్రదర్శించారు. ఆ నాటకంలోని నటీనటులు ఆర్థర్ బోర్షియర్, కిర్ల్ బెల్లీ థియేటరు మేడ మీద ఉండేవారు - ఒక ఫ్లాట్లో. మరొక ఫ్లాట్లో సంగీత దర్శకుడూ, నటుడూ, ఆనాటి ప్రసిద్ధమయిన కళాకారుడు ఇవోర్ నోవెల్లో ఉండేవాడు. ఆయన పేరునే ప్రస్తుతం ఈ థియేటరుకి పెట్టారు.




ఈ శతాబ్దకాలంలో అత్యద్భుతంగా నడిచిన ప్రదర్శన - 1971 నుంచి 1982 వరకు 6671 ప్రదర్శనలు జరిగిన నాటకం "నో సెక్స్ప్లీజ్ - ఉయ్ ఆర్ బ్రిటిష్" (సెక్సు వద్దు బాబూ - మేం బ్రిటిష్వారం).

2005 లో కామెరాన్ మెకింతోష్ ఈ థియేటర్ని తీసుకుని 45 లక్షల పౌన్ల ఖర్చుతో ఇప్పటి నోవెల్లో థియేటర్ని రూపు దిద్దారు.

నాటకాన్ని ఇన్ని శతాబ్దాల చరిత్ర, ఇంత విస్తృతమైన ఆదరణ, భాష, దేశం, సంస్కృతి ప్రమేయం లేకుండా - ఎందరో దర్శించే తీరూ

- ఈ విషయం మీద నేటి బిజినెస్ మేనేజ్‌మెంట్ నిపుణులూ, వ్యాపారాన్నీ కళనీ మేళవించే మేధావులూ
- పరిశోధన జరిపి చెప్పాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయనిపిస్తుంది.

మానవుడు తన మేధస్సుతో - తనకంటె చురుకయిన కంప్యూటర్‌తో పోటీ పడుతున్న ఈ రోజుల్లో 400 సంవత్సరాల కిందటి సంప్రదాయాన్ని అనునిత్యం పునరుద్ధించే ఆకర్షణకి 'జీవలక్షణం' ఏది? అయ్యా, కృషి చేసే జిజ్ఞాస ఉంటే ఇది ఓ గొప్ప డాక్టరేట్‌కి సరిపోయే 'ఇతివృత్తం!'

## "ది గ్లాస్ మినేగరీ"




**అసలు నాటకం** శీర్షికే అద్భుతమయిన కవితా ధోరణిలో నిర్దేశించినది. మినేగరీ అంటే ప్రదర్శనకి ఏర్పాటు చేసిన క్రూరజంతువుల సమూహం. అవి లొంగదీయడానికి వీలులేనివి - క్రూరజంతువులు కనుక. కానీ ఈ ప్రదర్శన ముట్టుకుంటే పగిలిపోయే గాజు జంతువుల ప్రదర్శన. నాటక హృదయమంతా శీర్షికలోనే చెప్పేశాడు రచయిత.


టెన్నిసీ విలియమ్స్

టెన్నిసీ విలియమ్స్ కీ కవిత్వానికీ చాలా దూరం. నగ్నంగా, నిజాయితీగా, వీలయితే కరకుగా నిలదీసి చూపే వాస్తవ వాది విలియమ్స్. ఆయన స్ట్రీట్ కార్ నేమ్డ్ డిజైర్, స్వీట్ బర్డ్ ఆఫ్ యూత్ వంటి నాటకాలు జీవితంలోని చీకటికోణాల్ని ఆవేశంతో, ఆవేదనతో ఆవిష్కరించిన గొప్ప రచనలు. ఈ శీర్షికలాంటి 'కవిత' ఆర్థర్ మిల్లర్‌కి చెల్లుతుంది. ఆర్థర్ మిల్లర్‌ని ఎవరో అడిగారట: 'మీ రచనలు కవితల్లాగ ఉంటాయి.' అని. టెన్నిసీ విలియమ్స్ రచనలో అంతర్గతంగా ఉన్న కవితా ధోరణి మనకి కాస్త గోచరిస్తుంది. ఆయనది కలలు కనే కవిత్వం కాదు. కలిసిరాని కలల పట్ల నిర్వీర్యతని వ్యక్తపరిచే జీవుని వేదన.

నేను చూసిన అయిదునాటకాలలో స్టేజి మీద ప్రదర్శనకి వ్రాసిన ఆధునిక నాటకం ఇదొక్కటే - షేక్స్పియర్‌ని కాస్సేపు పక్కన పెడితే మిగతా మూడూ సంగీత నాటకాలు. స్టేజ్ కోసం అన్వయించిన ఇతివృత్తాలు.

రచయితలు చెప్పదలచుకున్న విషయానికి ఒక్కొక్కప్పుడు ఒక్కో ప్రక్రియ అనువుగా ఉంటుంది. కాని ఇది స్మృతి నాటకం (memory play). నాటక సాహిత్యంలోనే విన్నూత్నమయిన ప్రక్రియ ఇది. నాటకం సమస్యల్ని ప్రతిఫలించాలి. విశ్లేషించాలి - పరోక్షంగా.

సమస్య పరిష్కారం నాటకం పనికాదు. చేస్తే అది కరపత్రం (పాంప్లెట్) అవుతుంది. మరి ఈ స్మృతి నాటకంలో ఉద్దేశమేమిటి? రచయిత విశ్లేషణని పాత్రకి అన్వయించి - అవసరమయినప్పుడు సన్నివేశాల్ని విశ్లేషించే అవకాశాన్ని ఈ నాటకంలో తనకి మిగుల్చుకున్నాడు రచయిత. మరొక విశేషం - ఈ నాటకంలో ప్రధాన పాత్ర - ఒకప్పుడు రచయితే! కనుక intellectual interference దోషం ఈ నాటకానికి అంటదు. నిజానికి అది subjective interference ఏ కనుక. ఇలాంటి నాటకాన్ని - ఈ నాటకాన్ని చదవని రోజుల్లోనే - దాదాపు 38 సంవత్సరాల క్రితం నేను రాశాను. దాని పేరు: "భారతనారీ! నీ మాంగల్యానికి మరో ముడి వెయ్యి." ఆ రోజుల్లోనే పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు ఆ నాటికని 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో ప్రచురించారు. అది ఒక వ్యక్తి మస్తిష్కంలో జరిగే సంచలనం. ప్రయోజనం? పాత్రల, సన్నివేశాల, సమస్యల విశ్లేషణకి రచయిత కోరుకున్నంత వెసులుబాటు. దరిమలాను నాలాగే మరో రచయిత అంతకు ముందే భావించినందుకు గర్వపడ్డాను. (అదృష్టవశాత్తూ నాకు పురాణం సాక్ష్యం)

నాటకాన్ని చూడాలి. రచనలో అయితే చదువుతూ కళ్ళముందు దృశ్యాన్ని ఊహించుకోగలిగిన వాళ్ళకి రచనలో సొగసు అందుతుంది. బెర్నార్డ్‌షా, ఆస్కార్ వైల్డ్, అనూయిల్ (ఫ్రెంచి రచయిత. ఉదా:బెకెట్) వంటి రచయితల రచనలు చదవడానికి మృష్టాన్న భోజనంలాగా ఉంటాయి. ఎడ్వర్డ్ ఆల్బీ, సాత్రే, పింటర్ వంటి వారి రచనలు చదవడానికి చాలా సాదా సీదాగా - ఇంకా చెప్పాలంటే 'ఇదేం నాటకం?' అనిపించేలాగా ఉంటాయి. అందుకు రెండు కారణాలు. చెప్పే విషంలో saturation చెప్పడంలో absurd theatreకి సంబంధించిన నిస్రాణ. (స్థూలంగా we are condemned to live అన్నది ఆబ్సెర్డ్ థియేటర్ మూల సూత్రం)

పోతే, రచనలో - నాటకానికి కదలికల్నీ ఆయా సందర్భాలలో నటులకు సూచనలిచ్చే వివరాలు వ్రాయడంలో ఓ అద్భుతమయిన శైలిని సాధించిన రచయిత యూజినీ ఓనీల్. మరో గొప్ప రచన - ది గ్లాస్ మినేగరీ. నాటకం చేత బుచ్చుకు చదివే వాళ్ళకి - రచయిత




సగం హృదయాన్ని - నటులతో పంచుకునే వాటాని నష్టపోతున్నామనిపించకమానదు. అందులో అద్భుతమయిన కవిత్వమూ ద్యోతకమవుతుంది.

అవిటితనంతో, సిగ్గుతో మొగ్గ అయిపోయే ఆడపిల్లని మొదటిసారిగా ఓ యువకుడి ముందు నిలబెట్టడానికి సిద్ధం చేశారు. ఆమెకి ఆత్మన్యూనతా భావం (ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్) అక్కడ అద్భుతమయిన కవిత్వమే రాశాడు రచయిత.

The dress is designed and coloured by memory. The aggangement of Laura's hair is changed; it is softer and more becoming. A fragile, unaearthy prettiness has come out in Laura; she is like a piece of translucent glass touched by light, given a momentary radiance, not actual, not lasting.

నాటక రచయిత గొప్ప 'ద్రష్ట' అని తెలిపే ఊతం ఇది. ఇంతకంటే అద్భుతంగా పాత్రీకరణని రచయిత వివరించడం నాకు తెలియదు.

ఇంతవరకు నేను వొస్తుండు నాటకాన్ని గురించి చెప్పలేదు. ఒకనాటి ప్రముఖ నాటక రచయిత గురించీ, రచన గురించీ మాత్రమే చెప్పాను.

నాటకం గురించి చెప్పేముందు నాటక రచయితని గురించి చెపితే సగం పని అయిపోయినట్టే. ఎందుకంటే ప్రతీ రచనలోనూ రచయిత వ్యక్తిత్వమో, వేదనో ప్రతిఫలించడం సామాన్యమైనా ఈ రచన అందుకు కొంత భిన్నమయినది. ఇది పూర్తిగా ఒకనాటి రచయిత జీవితం. నిజానికిది టెన్నిసీ విలియమ్స్‌ని నాటక రచయితగా నిలబెట్టిన మొదటి రచన ఇది. ఏమీ గజిబిజి లేకుండా తన జీవితాన్ని, ఆనాటి తన మానసిక స్థితినీ, సంఘర్షణనీ యధాతథంగా ఆవిష్కరించే అతి ఆవేశపూరితమయిన రచన ఇది.

టెన్నిసీ విలియమ్స్ జీవితంలో రెండే రెండు ముఖ్యమయిన అంశాలు. ఒకటి: తన సాహిత్యం. రెండు: తన చెల్లెలు. మిసిసిపీ ప్రాంతంలోని (1944 లో తన స్నేహితురాలు మార్గరేట్ 'మార్గో' జోన్స్‌కి వ్రాసిన్న ఉత్తరంలో ఇలా పేర్కొన్నాడు విలియమ్స్.It has more interesting new techniques….I consider the compulsive struggle it was to do the thing and what a frightful, sentimental mess it might well have been…I think it contains my sister…") అతి సాధారణ నేలబారు జీవితంలోంచి వచ్చిన విలియమ్స్ తన గతాన్నీ, తొలినాటి పీడకలల్నీ ఆ జీవితంలోని హృదయవిదారకమయిన అనుభూతుల్ని ఏనాడూ మరిచిపోలేదు. ఎ స్ట్రీట్ కార్ నేమ్డ్ డిజైనర్‌లో పతాకస్థాయిని సాధించిన రచయిత తొలి విజయం - 1945 నాటి ఈ 'ది గ్లాస్ మినేగరీ'. నూటికి నూరుపాళ్ళూ తన చెల్లెలు - ఈ నాటకంలో లారా పాత్ర. నిజ జీవితంలో అతని పేరు థామస్ లేనియర్ విలియమ్స్. 1983లో మొదటి నాటికల్ని ప్రచురణకి పంపే రోజుల్లో తన పేరుని టెన్నిసీ విలియమ్స్‌గా మార్చుకున్నాడు. ఆ థామస్సే నాటకంలో 'టామ్' అయాడు. రచయితే పాత్ర అయే నాటకాలు - సాహిత్యంలో - చాలా గొప్పవి ఉన్నాయి. జాన్ ఆస్‌బార్న్ "లుక్ బాక్ ఇన్ ఏంగర్" (1956). ఈ నాటకం చదివాక నేను నాలుగురోజులు మనిషిని కాలేకపోయాను. బేర్టోల్ట్ బ్రెక 'బాల్' (1926), నోల్ కొవార్డ్ 'ది వోర్టెక్స్ (1924) చెప్పుకోదగ్గవి. రచయిత మాటల్లో చెప్పాలంటే the play was the saddest he had ever written.

విలియమ్స్ చెల్లెలు రోజ్ అతని కన్న ఎనిమిదేళ్ళు చిన్నది. ఒక విధమయిన నిస్పృహతో, మానసికమయిన రుగ్మతతో కృంగిపోయేది. చాలా మానసికమయిన రోగాల ఆసుపత్రులలో చికిత్సలు జరిపించాక - రోజ్ మానసిక స్థితి మరింత క్షీణించి - జీవితాంతం దాదాపు పిచ్చిదానిగానే బ్రతికింది. నాటకంలోని లారా పాత్ర కుంటితనం తన చెల్లెలు అవలక్షణానికి నాటకీయమయిన సామ్యం. నిజజీవితంలో రోజ్ తన అన్న (టెన్నిసీ విలియమ్స్) పోయాక పదమూడు సంవత్సరాలు బ్రతికి తన 86 వ ఏట గుండె నొప్పితో కన్నుమూసింది.


టామ్‌గా ఎడ్‌స్టాపార్డ్

అత్యంత ప్రియతమయిన తన చెల్లెలు - ఆమె లక్షణం - ఆమెని కృంగదీసే దీన స్థితిని నిస్సహాయంగా గమనిస్తూ - తన బిడ్డల పురోగతికి తల్లడిల్లిపోయే తల్లి ఆదరణనీ, నిరంతరం ఆమె (Protective possessiveness)ని తట్టుకోలేక (తండ్రి ఏనాడో ఇంట్లోంచి మాయమయాడు. ఓసారి "హల్లో - గుడ్ బై" అని సందేశాన్ని పంపాడు. పంపిన అడ్రసు లేదు. తర్వాత అతని జాడ లేదు) తనదయిన దారిని (దాదాపు తండ్రి అడుగుజాడల్లోనే!) వెతుక్కోవడం కథ. తన కలల్లోకి నిష్క్రమించాలనే ఆర్తిని బిగపట్టుకుని బిగపట్టుకుని - ఇటు ఆత్మీయతా, కుటుంబం పట్ల బాధ్యతలతో మానసికంగా సతమతమయి ఎట్టకేలకు మాయమయాడు టామ్ - వెరసి - నిజజీవితంలో టెన్నిసీ విలియమ్స్. అదీ నాటకం.

గ్రీకు నాటకాలు, షేక్స్పియర్ నాటకాలలో తొంగి చూసే ప్రక్రియని ఆధునికా నాటకంలో మధ్య మధ్య సంగీతపరమయిన ఫేడిన్‌లతో, షాడో ప్లేలతో - జర్మన్ ఎక్స్‌ప్రెషనిజమ్‌ని తలపింపజేశాడని ఈ నాటకాన్ని గురించి ఓ సమీక్ష ఉంది.

1948లో - అంటే నాటకం వ్రాసిన మూడవ ఏట ప్రముఖ బ్రిటిష్ నటుడు జాన్ గిల్‌గుడ్ ఈ నాటకాన్ని హేమర్కెట్ థియేటర్‌లో ప్రదర్శించారు. ఇది స్మృతి నాటకం కనుక ఎంతో కొంత అవాస్తవంగా కనిపిస్తుంది. కాగా జ్ఞాపకం కొన్ని వెసులుబాట్లను తనంతట తానే సంపాదించుకుంటుంది. ఆలోచనకి అవధులులేవు కనుక కొన్ని సన్నివేశాలు, ఆయా సందర్భాలలో ప్రతిఫలించే ఉద్వేగమూ ఎంతో కొంత ఉత్ప్రేక్షకులోనయాయి. ఎందుకంటే స్మృతి హృదయస్పందనది కనుక.

టామ్ మొదటి మాటలివి: "నా దగ్గర కొన్ని ఇంద్రజాలకుడి ట్రిక్కులున్నాయి. కాని నేను స్టేజి మీద ఇంద్రజాలకుడిని కాను. అతను నిజమేమో అనిపించే భ్రమని కలిపిస్తాడు. కాని నేను నిజానికి 'భ్రమ' ఏమో అనిపించే అంగీ తొడుగుతాను......... స్మృతిలో అన్నీ - సంగీత పరంగా జరుగుతున్నట్టనిపిస్తయి. సైడు కర్టెన్‌లో అడపాదడపా వినిపించే సంగీతానికి అర్థం ఇది. స్మృతి నాటకం కనుక అవాస్తవం కనుక - దీపాలు మసకగా, సెంటిమెంటల్‌గా కనిపిస్తాయి -" నేను రాస్తున్న మాటలు కావివి. పాత్ర చెప్పే మాటలు. రచయిత నాటకం రేంజిని ఎంత స్వేచ్ఛగా, ఎంత విస్తృతంగా పెంచాడో చెప్పడానికి ఇది ఉదాహరణ. (నా 'మాంగల్యానికి మరో ముడి' నాటకాన్ని ఇప్పుడెవరయినా చదివితే - ఇలాంటి వివరణ నేనూ 38 ఏళ్ళకిందటే ఇచ్చానని గర్వపడాలనిపిస్తుంది.)


లారా పాత్రలో అమందా హేల్

నాటకం ఆద్యంతమూ - ప్రతి సన్నివేశానికీ, కొండకచో సంభాషణలలో కూడా "సింబల్"ని వాడారు రచయిత. ఈ 'ధ్వని' మరో కొత్త ఆలోచనని సామాజికులలో స్ఫురింపజేస్తుంది. అటువంటి స్ఫురణకు రచయిత తావిచ్చినందుకే సామాజికుడు పొంగిపోతాడు Audiences' interest is directly proportional to what is left unsaid and ambiguously hinted at. స్ఫూర్తిగల ప్రేక్షకుడికి 'కాకినాడ కాజా'లాగ ఈ నాటకంలో ధ్వని పీల్చినకొద్దీ రసం చిప్పిలుతుంది. ఉదాహరణకి లారా గాజుబొమ్మల కొలవులో తల మీద ఒకే కొమ్మున్న జంతువు (యూనీ కోర్న్) బొమ్మ ఉంది. కొమ్ము వికారంగా ఉన్నదని ఆమె ఉద్దేశం. (తనపట్ల తనకే ఉన్న ఆత్మన్యూనతా భావానికి ఇది స్ఫురణ.) వచ్చిన జిమ్ ఆమె అవలక్షణాన్ని ఎంతో కొంత పోగొడతాడు. ఆమెలో ఆత్మ విశ్వాసం, ఆత్మ స్థయిర్యం ఆమేరకు చోటు చేసుకుంటుంది. ఇప్పుడు యూనీకార్న్ బొమ్మ నేలన పడింది. కొమ్ము విరిగింది. ఆమెలో అవలక్షణం కాస్తా పోయింది కొమ్ములేని బొమ్మ ఇప్పుడు కాస్త అందంగా ఉంది - అది లారా!


అపోలో థియేటర్ ముందు

ఇలా నాటకమంతా ద్వర్థి కావ్యంలాగ సాగుతుంది రచన. ఒక రచయిత ఆలోచనని సంధించిన నేర్పుకి ఇది చక్కని, గొప్ప నిదర్శనం.

ఉత్తమ సహాయనటిగా రెండూ సార్లు ఆస్కార్ బహుమతి నందుకున్న (సిడ్నీ పొలాక్ 'టూట్సీ', టోనీ రిచర్డ్ సన్ 'బ్లూస్కై') జెస్సికా లాంగ్ తల్లి పాత్ర నటించింది. హాలీవుడ్ తారలు రంగస్థలం మీద నటించడం - రంగస్థలం అదృష్టంగా భావిస్తారు. ఈ వెస్టెండులో ఎడ్వర్ ఫాక్స్ (ది డే ఆఫ్ ది జాకాల్), మేకేల్ మినిట్టీ (టైటానిక్‌లో

విలన్), ఎలెక్ గిన్నిస్ (బ్రిడ్జి ఆన్ ది రివర్ క్వాయ్), జెస్సికా లాంగ్, యూల్ బ్రిన్నర్, రెక్స్‌రిసన్, ఆంథోనీ హాప్‌కిన్స్, లారెన్స్ ఆలీయర్, జూడీ డెంచ్ - ఈ జాబితా అనంతం, అపూర్వం.

ఈ నాటకంలో ఆత్మన్యూనతా భావంతో, అవిటితనంతో కృంగిపోయే అమందా హేల్ అనే నటి నటించింది. ఇప్పుడు కళ్ళు మూసున్నా - నిస్సహాయతతో, దైన్యతతో, సిగ్గుతో మంచుముద్దలాగ కరిగిపోయే ఆ పాత్ర నా కళ్ళముందు దర్శనమిస్తుంది. రెండున్నర గంటల వ్యవధిలో - ఏమీ తికమకలు లేకుండా అతి స్పష్టంగా, నిర్దుష్టంగా తీర్చి దిద్దిన నాలుగు పాత్రీకరణల కళాఖండం ది గ్లాస్ మినేగరీ, అతి హృద్యంగా రంగస్థలం మీద తీర్చిదిద్దిన ఘనత దర్శకుడు రూపర్ట్ గూల్డ్‌ది. నా జీవితంలో నాకూ - నాలాంటి ఆనాటి కళాకారులకూ దక్కని థియేటర్ ఆర్ట్స్ కోర్సుని కేంబ్రిడ్జ్ కాలేజీలో చదివారు గూల్డ్

నేను చూసిన అయిదు నాటకాలలో ఏమీ తిరకాసులేని - నికార్సయిన స్టేజ్ నాటకం ది గ్లాస్ మినేగరీ. మిగతావి రకరకాల అద్భుతాల, విస్తృతమయిన కళల కళల సమ్మేళనం. ఇక్కడ 'నాటకీయత'కి మాత్రమే పెద్ద పీట వేసిన ప్రదర్శన ఇది.

ఇక స్థూలంగా అపోలో థియేటర్ గురించి. సంగీత రూపకాలకోసం - కళలకు రాజయిన గ్రీకు దేవుడ్ - అపోలో పేరుతో 1901లో ఈ థియేటర్ నిర్మాణం జరిగింది. 1920 ప్రాంతానికి నాటకాల రుచి మరిగే డాఫ్నే డూ మారియర్, ఎడ్వర్డ్ ఆల్బీ, సీన్ ఒకేసీ, రాబర్ట్ షెర్వుడ్ వంటి రచయితల నాటకాలు ప్రదర్శితమయాయి.

సర్ జాన్ గిల్‌గుడ్ (బ్రిటన్ గర్వపడే నటులలో ఒకరు) తన 83 వ ఏట ఆఖరి ప్రదర్శన - 1988 లో "బెస్ట్ ఆఫ్ ఫ్రెండ్స్" ఇక్కడే నటించారు.

పికడిల్లీ అండర్ గ్రౌండ్ స్టేషన్‌కి కూత వేటు దూరం అపోలో. నిజానికి షాఫ్ట్స్‌బరీ రోడ్డులోకి మళ్ళితే - దారిపొడుగునా మిమ్మల్ని నాటకరంగ పరిమళం చుట్టుకుంటుంది విక్టర్ హ్యూగో, టెన్నిసీ విలియమ్స్, షేక్స్పియర్‌హర్ - ఇంకా మీరూహించని సంగీత నాటకాల స్పందన మిమ్మల్ని తాకుతూంటుంది.

బ్రిటన్ వెళ్ళడానికి మీకు చాలా కారణాలుండొచ్చు. చూడడానికి చాలా ఆకర్షణలు ఇక్కడే గురుపెట్టుకోవచ్చు - లండన్, బ్రిడ్జ్, స్ట్రాట్ ఫర్డ్ అపాన్ ఏవన్, 10 డౌనింగ్ స్ట్రీట్, ట్రఫాల్గర్ స్క్వేర్, బకింగ్ హామ్ పాలెస్, హైడ్ పార్క్, లండన్ మ్యూజియం, వింబుల్డన్ - ఏదయినా ఏమయినా. కాని ఒక్క సాయంకాలం - ఒకే ఒక్క సాయంకాలం - వెస్టెండులో అడుగు పెట్టండి. 500 సంవత్సరాల వైభవం అక్కడ ప్రతీరోజూ మీకోసం, మిమ్మల్ని పలకరించడానికి సిద్ధంగా ఉంటుంది. ఇందుకు మీరు రచయిత కానక్కరలేదు, సాహితీ స్పర్శ అస్సలు అక్కరలేదు. మంచిని ఆహ్వానించే అభిరుచీ, కళని ఆస్వాదించే అభినివేశం ఉంటే చాలు. మీరు అదృష్టవంతులయితే ఒక్క వెస్టెండు కోసమే లండన్ వెళ్ళండి. ఆ తర్వాత "తిరిగి రండి" అనడానికి నాకు ధైర్యం చాలదు. ఎందుకంటే మీరక్కడ మీ మనస్సు పారేసుకుని వస్తారు కనుక.